VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శుక్రవారం 17.07.2026
సంపుటి : 09 సంచిక : 38 , పెజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



2

## నా శ్వాస, ధ్యాస కరీంనగర్

- కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా
- కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో గల్లీగల్లీలో సీసీ రోడ్లు నిర్మిస్తా

# పూరీ జగన్నాథ రథయాత్రలో విషాదం..





2

- తొక్కిసలాటలో ఒకరు మృతి, 100 మందికిపైగా గాయాలు
- లక్షలాది మంది భక్తుల రద్దీతో రథయాత్రలో అపశ్రుతి
- తొక్కిసలాటలో కటక్‌కు చెందిన అనిల్ దాస్ మృతి
- 100 మందికిపైగా భక్తులకు గాయాలు.. ఆస్పత్రుల్లో చికిత్స
- సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు, అత్యవసర వైద్య బృందాలు
- ఘటనపై అధికారులు ఆరా.. రద్దీ నియంత్రణకు అదనపు భద్రత

పూరీ (ఒడిశా), వెలుతురు జూలై 15: జూలై 16:

ఒడిశాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలో జరుగుతున్న శ్రీ జగన్నాథ రథయాత్రలో విషాద ఘటన చోటుచేసుకుంది. లక్షలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొనేందుకు తరలిరావడంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో కటక్‌కు చెందిన అనిల్ దాస్ అనే భక్తుడు మృతిచెందగా, 100 మందికిపైగా భక్తులు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు, వైద్య సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరికి స్వల్ప గాయాలు కాగా, మరికొందరి పరిస్థితిపై వైద్యులు నిఘా ఉంచినట్లు తెలుస్తోంది.రథయాత్ర సందర్భంగా శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి రథాలను దర్శించేందుకు వేలాదిగా భక్తులు ఒకేచోట చేరడంతో రద్దీ ఒక్కసారిగా పెరిగింది.

# హిందూ సంస్కృతిపై దాడి చేస్తే ఊరుకోం

- ప్రైవేట్ స్కూల్ వివాదంపై కేంద్ర మంత్రి బండి నిప్పులు
- మజ్లిస్, పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం
- సైదాబాద్ స్కూల్ హోంవర్క్ వివాదంపై ధ్వజం
- హిందూ విద్యార్థులపై కల్మా



2

బలవంతపు రుద్దుడు దుర్మార్గం

## గోల్కొండ బోనాలు ప్రారంభం..

- జగదాంబ మహంకాళి అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల సమర్పణ

హైదరాబాద్, వెలుతురు జులై 16:

హైదరాబాద్‌లో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు ఘనంగా శ్రీకారం చుట్టారు. బోనాల ప్రారంభోత్సవాల్లో భాగంగా లంగర్ హౌస్ చౌరస్తాలోని గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రభుత్వం తరపున ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రభుత్వం తరపున రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధిగా ఉండాలని ప్రార్థించారు.



2

## అడవుల రక్షణతోనే మానవ మనుగడ

- పాతకాలపు అలవాట్లు నేడు బంగారంతో సమానం
- మంత్రి దనసరి సీతక్క పిలుపు!
- గొనెపల్లిలో మహిళా సంఘాలకు తేనెటీగల పెంపకం శిక్షణ
- ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించిన మంత్రి సీతక్క
- ప్రకృతి ప్రసాదించిన ఫలాలతోనే సంపూర్ణ ఆరోగ్యం
- ప్లాస్టిక్ ప్లేట్ల వాడకంతో పెరుగుతున్న క్యాన్సర్ మహమ్మారి
- మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట
- వడ్డీ లేని రూ.10 లక్షల రుణాల పంపిణీపై మంత్రి వెల్లడి

ములుగు, వెలుతురు జులై 16:

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సరికొత్త ఉపాధి మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా గురువారం నాడు ములుగు జిల్లా తాడ్వాయి మండలం



గొనెపల్లి గ్రామంలో ఒక ముఖ్యమైన శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, ఇందిరా మహిళాశక్తి జీవనోపాధుల పథకం కింద మహిళా సంఘాల సభ్యులకు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ప్రత్యేక శిక్షణను ఆమె అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అడవులతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరూ అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఇప్పపువ్వు, మోదిగాకులు, అడవి తేనె మానవ ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని చెప్పారు.

▶ మిగతా 2లో

## ఓట్లు- సీట్లు ఇవ్వలేదని ఖమ్మం జిల్లాపై బిఆర్ఎస్ కక్ష

- కావాలనే సీతారామ ప్రాజెక్ట్ రైతులకు అన్యాయం చేశారు
- 1.25 లక్షల ఎకరాలకు నీరిచ్చాం- అదనంగా ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2

## మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు జేఏసీ వినతిపత్రం



4

హైదరాబాద్ వెలుతురు జూలై 16:

మహిళలకు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అమలు చేయాలని మహిళా రిజర్వేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు గురువారం మహిళా సంఘాల ప్రతినిధులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మహిళా రిజర్వేషన్ల అమలును జనగణన, నియోజక వర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)తో అనుసంధానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ, రాజ్యాంగ సవరణ ద్వారా ఆ షరతులను తొలగించి వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

## ఎల్-నినో సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు రాష్ట్రం సిద్ధం

- రైతులకు శాస్త్రీయ మార్గదర్శకంగా రాష్ట్రస్థాయి ఎల్-నినో కంటింజెన్సీ ప్లాన్
- ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక విడుదల

హైదరాబాద్ వెలుతురు జులై 16:

రాష్ట్రంలో ఎల్–నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించి, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే లక్ష్యంతో రూపొందించిన "రాష్ట్రస్థాయి ఎల్–నినో కంటింజెన్సీ ప్లాన్–2026 (వానాకాలం)" ను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇక్రిశాట్ (ICRISAT), భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (IIMR), ఐఐఓఆర్, సిఆర్ఐడిఎ (CRIDA), భారత వాతావరణ శాఖ (IMD), వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖల శాస్త్రవేత్తలు, నిపుణులు కలిసి అత్యంత సమగ్రంగా ఈ కంటింజెన్సీ ప్లాన్‌ను రూపొందించినట్లు తెలిపారు.



8

## సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం..




2

- త్వరలో గోదావరి జలాలు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- గత ప్రభుత్వం రీడిజైనింగ్‌తో ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిందన్న భట్టి విక్రమార్క

## అమెరికా సైనికులను బంధించండి

- ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి సంచలన పిలుపు
- పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలపై భూతల దాడులు చేయాలని సూచన
- 100 మంది అమెరికా సైనికులను బంధించి ఇరాన్‌కు తీసుకురావాలని మనుచెహర్ మొత్తకి వ్యాఖ్యలు



12



12

## అంగన్‌వాడీ కేంద్రాలకు వెలుగులు

- చీకట్లను తరిమి.. చిన్నారుల కేంద్రాల్లో వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం
- మంత్రి సీతక్క చొరవతో అంగన్‌వాడీలకు ఉచిత విద్యుత్

## యుకె కు ఎగుమతులు పెంచుతాం: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ వెలుతురు జూలై 16:

భారత్– యునైటెడ్ కింగ్ డమ్ ల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సిఇటిఎ) వల్ల తెలంగాణా గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు.



5

# గోల్కొండ బోనాలు...

(మొదటి పేజీ తరువాయి)

బోనాల ఉత్సవాలు విజయవంతంగా, శాంతియుతంగా జరగాలని వారు అమ్మవారిని వేడుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడగా, సంప్రదాయ వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మధుయాష్కి గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కాల్వ సుజాతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఆషాఢ మాసంలో తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిర్వహించే బోనాల ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా అత్యంత వైభవంగా జరుగుతాయి. గోల్కొండ జగదాంబ మహంకాళి ఆలయంలో ప్రారంభమైన బోనాల వేడుకలు అనంతరం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, పాతబస్తీ లాల్‌దర్వాజా మహంకాళి ఆలయాలతో పాటు నగరంలోని వివిధ మహంకాళి దేవాలయాల్లో కొనసాగనున్నాయి. బోనాల ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం, పోలీసు, జీహెచ్ఎంసీ తదితర శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.

# పూరీ జగన్నాథ రథయాత్రలో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుని తొక్కిసలాటకు దారితీసినట్లు ప్రాథమిక సమాచారం. ఘటన జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో భక్తులను క్రమబద్ధంగా బయటకు తరలించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.ఘటనపై పోలీసులు, జిల్లా యంత్రాంగం విచారణ ప్రారంభించారు. తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా ఆరా తీస్తున్నారు. భక్తులు ఆందోళనకు గురికాకుండా అధికారుల సూచనలు పాటించాలని, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# అడవుల రక్షణతోనే...

(మొదటి పేజీ తరువాయి)

మన పూర్వీకుల పాతకాలపు నాటి జీవన విధానం మరియు ఆహార అలవాట్లు నేటి రోజుల్లో బంగారంతో సమానమని కొనియాడారు. ఆధునిక కాలంలో ప్లాస్టిక్ ప్లేట్లలో వేడి ఆహారం తీసుకోవడం వల్లే ప్రజలు క్యాన్సర్ వంటి భయంకరమైన రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాంప్రదాయ మోదిగాకుల్లో భోజనం చేయడం వల్ల శరీరానికి ఎంతో ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు.రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు కేవలం ఇంటి పనులకే పరిమితం కాకుండా, సొంతంగా వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి వడ్డీ లేని రూ.10 లక్షల వరకు భారీ రుణాలను ప్రభుత్వం అందిస్తోందని వెల్లడించారు. ఈ విధంగా పొందిన బ్యాంకు రుణాలను మహిళలు వృథా చేయకుండా, సరైన ఉపాధి మార్గాల్లో పెట్టుబడిగా పెట్టి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని చెప్పడానికి మంత్రి సీతక్క ఒక అద్భుతమైన ఉదాహరణను పంచుకున్నారు. గత కొద్ది నెలల క్రితం ఎస్ఎస్ తాడ్వాయి మండలం పరిధిలోని కొండపర్తి గ్రామంలో కేవలం రూ.50 వేల స్వల్ప పెట్టుబడితో మహిళలు ఒక ఇప్పపువ్వు లడ్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. అడవిలో దొరికే ఇప్పపువ్వుతో వారు చేసిన లడ్లకు మార్కెట్లో మంచి ఆదరణ లభించిందన్నారు. ఆ చిన్న వ్యాపారంతో నేడు మహిళా సంఘం సభ్యురాళ్లు ఏకంగా రూ.5 లక్షల వరకు భారీ ఆదాయాన్ని ఆర్జించి రికార్డు సృష్టించారని మంత్రి అభినందించారు.కొండపర్తి గ్రామం తరహాలోనే గొనెపల్లి గ్రామంలోని మహిళలు కూడా తేనెటీగల పెంపకం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని మంత్రి సూచించారు. ఇందుకోసం హంబుల్ బీ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ శాస్త్రీయ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలందరూ పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో నాణ్యమైన తేనెను సేకరించడం ద్వారా మార్కెట్లో మంచి ధర లభిస్తుందని, తద్వారా ప్రతి కుటుంబానికి స్థిరమైన ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు.వ్యవసాయ రంగం మరియు ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై కూడా మంత్రి సీతక్క ఈ వేదికగా స్పందించారు. ప్రస్తుత సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రైతులు కేవలం సాంప్రదాయ వరి పంటపైనే ఆధారపడకుండా, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని హితవు పలికారు. నీటి ఎద్దడిని తట్టుకునే పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాల నుంచి గట్టెక్కవచ్చని రైతులకు సూచించారు.రైతు సోదరులు తమ పొలాల్లో కందులు, పెసర్లు, మొక్కజొన్న వంటి అల్పావధి మరియు చిరుధాన్యాల పంటలను సాగు చేసుకోవాలని మంత్రి కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లో వీటికి విపరీతమైన ఆదరణ పెరుగుతోందని, రానున్న రోజుల్లో ఈ ప్రత్యామ్నాయ పంటలకు దేశవ్యాప్తంగా భారీ డిమాండ్ మరియు గిట్టుబాటు ధర లభిస్తుందని స్పష్టం చేశారు.

# సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం..

- ఇప్పటికే పెట్టిన ప్రజాధనాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయం
- రాజీవ్ లింక్ కాల్వ, వైరా–పాలేరు అనుసంధానం, జుల్లూరుపాడు టన్నెల్ పనులపై సమీక్ష

**హైదరాబాద్, జూలై 16**

సీతారామ ప్రాజెక్టు పేరుతో గత ప్రభుత్వం రీడిజైనింగ్ చేసి ప్రాజెక్టు వ్యయాన్ని భారీగా పెంచి ప్రజాధనంపై అదనపు భారం మోపిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. అయినప్పటికీ ఇప్పటికే ప్రాజెక్టుపై భారీగా ప్రజాధనం వెచ్చించినందున దానిని నిలిపివేయకుండా వేగంగా పూర్తి చేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో సమీక్షించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు, కాంట్రాక్టు సంస్థలకు అవసరమైన సూచనలు చేసినట్లు చెప్పారు.ప్రాజెక్టులో అత్యంత కీలకమైన రాజీవ్ లింక్ కాల్వ, వైరా–పాలేరు రిజర్వాయర్ల అనుసంధానం, జుల్లూరుపాడు టన్నెల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే గోదావరి జలాలను సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు ఆయకట్టు ప్రాంతాలకు త్వరగా అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.1,000 కోట్ల బిల్లులను విడుదల చేసిందని భట్టి విక్రమార్క తెలిపారు. నిధుల కొరతతో పనులు ఆగిపోకుండా అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తున్నామని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.రైతులకు సాగునీటిని అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న భట్టి విక్రమార్క.. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి గోదావరి జలాలను రైతులకు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.

# హిందూ సంస్కృతిపై దాడి చేస్తే ఊరుకోం

- సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌పై తక్షణమే కఠిన చర్యలకు డిమాండ్
- సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపు
- సెక్యులర్ సంఘాల మౌనంపై బండి సంజయ్ సూటి ప్రశ్న
- ఇలాంటి ఘటనలపై ఎందుకు నోరు మెదపడం లేదని ఆగ్రహం

**హైదరాబాద్, జూలై 16:**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర పరిధిలోని సైదాబాద్ ప్రాంతంలో ఉన్న సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో చోటుచేసుకున్న ఒక ఉదంతం తీవ్ర వివాదాస్పదంగా మారింది. స్కూల్‌లో చదువుతున్న హిందూ విద్యార్థులకు కల్మా, సూరహ్ ఫతేహ్ చదవాలంటూ ఉపాధ్యాయులు హోంవర్క్ ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు బరితెగించి బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. పసిపిల్లలపై ఇలాంటి ధార్మికాంశాలను హుకుం జారీ చేస్తూ బలవంతంగా రుద్దాలని చూడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన ధ్వజమెత్తారు.

ఈ వివాదాస్పద ఘటనకు కారణమైన సైదాబాద్ సక్సెస్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం, బాధ్యులపై విద్యాశాఖ మరియు పోలీస్ శాఖ తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ గట్టిగా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తాజాగా ఒక అధికారిక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యను నేర్పించాల్సింది పోయి, ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం సమాజానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఈ దుశ్చర్యను కులమతాలకు అతీతంగా సమాజంలోని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తన ప్రకటనలో పిలుపునిచ్చారు.నగరంలో ఇంత పెద్ద వివాదం జరుగుతున్నా, హిందూ విద్యార్థుల హక్కులకు భంగం వాటిల్లుతున్నా రాష్ట్రంలోని మేధావులు, సెక్యులర్ సంఘాలు మౌనంగా ఉండటాన్ని కేంద్ర మంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. నిరంతరం సెక్యులరిజం గురించి మాట్లాడే సదరు సంఘాల నాయకులు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని సూటిగా ప్రశ్నించారు. వేరే విషయాల్లో చిన్న చిన్న సంఘటనలు జరిగినా పెద్ద ఎత్తున స్పందించే వారు, హిందూ సంస్కృతిపై ఇంత బహిరంగంగా దాడి జరుగుతుంటే ఎందుకు మౌన వ్రతం వహించారో సమాజానికి సమాధానం చెప్పాలని బండి సంజయ్ నిలదీశారు.

రాష్ట్రంలో రానున్న రోజుల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారబోతున్నాయని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి రావడం పక్కా అని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికార బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాష్ట్రంలోని పాఠశాలల్లో చదువుకునే హిందూ విద్యార్థులందరికీ బొట్టు పెట్టుకోవడాన్ని తప్పనిసరి చేస్తామని సంచలన ప్రకటన చేశారు. విద్యార్థులు తమ సాంప్రదాయాలను గౌరవించేలా చూస్తామన్నారు. విద్యాసంస్థల్లో హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పటిష్టంగా పాటించేలా అన్ని రకాల కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇటీవల నగరంలో జరిగిన ఆటో డ్రైవర్ భరత్ ఉదంతాన్ని కూడా బండి సంజయ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ఆటో డ్రైవర్ భరత్‌ను కొందరు పోలీసులు మరియు మజ్లిస్ పార్టీ నాయకులు కలిసి తీవ్రమైన వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. ఒక సామాన్య ఆటో డ్రైవర్‌ను టార్గెట్ చేసి వేధించిన సదరు పోలీసు అధికారులు, మజ్లిస్ నాయకులపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి కఠినంగా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు తాము ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు..నగరంలో జరుగుతున్న ఇలాంటి వరుస అక్రమాలు, ఏకపక్ష వేధింపుల ఘటనలపై ప్రభుత్వ యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించడం సరికాదని బండి సంజయ్ హితవు పలికారు. అధికార పక్షం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇలాంటి వాటిని నిర్లక్ష్యం చేస్తే, ఈ తరహా ఉదంతాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజధాని నుంచి తెలంగాణ అంతటా విస్తరించే ప్రమాదం ఉందని తీవ్రంగా హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించకపోతే రాష్ట్రంలో అశాంతి రేగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్ భరత్ వ్యవహారంలో చట్టం తన పక్షపాత బుద్ధిని చూపిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. అసలు భరత్ రాసిన రాతల్లో చట్ట వ్యతిరేకమైనది ఏముందని ఆయన ప్రశ్నించారు.

నగరంలో ఎన్నో ఆటోలపై, బహిరంగ గోడలపై హిందువుల మనోభావాలను కించపరిచేలా ఉర్దూ భాషలో రాతలు రాసుకున్న వారిపై పోలీసులు ఎందుకు సుమోటోగా కేసులు నమోదు చేయడం లేదని నిలదీశారు. మజ్లిస్ నాయకులకు ఒక న్యాయం, సామాన్యుడైన భరత్‌కు మరొక న్యాయమా అని, చట్టం అందరికీ సమానంగా వర్తించదా అని పోలీసుల తీరును తప్పుపట్టారు.

హిందూ సమాజం యొక్క ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కాపాడటానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని బండి సంజయ్ స్పష్టం చేశారు. సైదాబాద్ స్కూల్ ఘటన కేవలం ఒక పాఠశాల సమస్య కాదని, ఇది హిందూ సంస్కృతిపై జరుగుతున్న క్రమబద్ధమైన దాడి అని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు నైతిక విలువల కంటే ఇలాంటి పద్ధతులు నేర్పడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గేదే లేదని, బాధ్యులపై చట్టపరమైన విచారణ జరిపించి స్కూల్‌పై తగిన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకువస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ తన ప్రకటన ద్వారా భరోసా ఇచ్చారు.

# నా శ్వాస, ధ్యాస కరీంనగర్...

- కరీంనగర్ రూపురేఖలు మారుస్తా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



“తన ధ్యాస, శ్వాస అంతా కరీంనగర్ పైన ఉందని, పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. అందులో భాగంగా రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకుంటూ పార్లమెంట్ అభివృద్ధికి క్రుషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ కు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద వచ్చిన నిధులతో త్వరలోనే గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మించడంతోపాటు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం రోజున సాయంత్రం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి 36వ డివిజన్ లోని మారుతీనగర్ నైస్ ఇండియా బిల్డింగ్ వద్ద రూ.60 లక్షల (యూఐడీఎఫ్ రూ.50 లక్షలు, జనరల్ ఫండ్ రూ.10 లక్షలు) వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 27వ డివిజన్ శివాజీ నగర్ లోని కరీంనగర్ డెయిరీ సమీపంలో రూ.49 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బండి సంజయ్ రాక సందర్భంగా ఆయా డివిజన్ల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి బండి సంజయ్ పై పూలు చల్లి స్వాగతం పలికారు. సంజయ్ తో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏమన్నారంటే.కరీంనగర్ కార్పొరేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. స్మార్ట్ సిటీ, అమ్రుత్ 1, 2, యూడీఎఫ్ పేరుతో కేంద్రం నుండి వేల కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసినం. ఇటీవల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద 840 కోట్లు తీసుకొచ్చినం. యూడీఎఫ్ కింద మరో 30 కోట్లు రాబోతున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి.నేను మళ్లీ చెబుతున్నా.... నా ధ్యాస, శ్వాస అంతా కరీంనగర్ పైనే ఉంది. కరీంనగర్ కార్పొరేషన్ సహా పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న. అందుకోసం కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చేందుకు క్రుషి చేస్తున్నా. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి.తాజాగా కేంద్రం మంజూరు చేసిన రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ (మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు) వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం.ఇప్పటికే శాతవాహన వర్సిటీకి 12 బి హోదాను తీసుకొచ్చిన, లా కాలేజీ మూంజురు చేయించిన. ఎస్సారార్ కాలేజీకి అటానమస్ తెచ్చుకున్నం. డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల బాధలను నిర్మూలించేందుకు ప్రత్యేక నిధులు తీసుకొచ్చిన. నా ఏడేళ్ల ఎంపీ పదవీ కాలంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం దాదాపు రూ.22 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చిన. సీఐఆర్ఎఫ్ కింద వందల కోట్ల నిధులు తెచ్చి రోడ్లు వేయించిన. కరీంనగర్ లో అథ్లెటిక్స్ ట్రాక్ కోసం నిధులు తెచ్చిన. జమ్మికుంటలో స్టేడియం నిర్మాణం కోసం కోట్లాది రూపాయలు తీసుకొచ్చిన. ఇవిగాక సీఎస్సార్ నిధులతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేసిన. ప్రభుత్వ స్కూళ్లలోని టెన్త్ క్లాస్ విద్యార్థులందరికీ మోదీ గిఫ్ట్ పేరుతో 20 వేల సైకిళ్లు అందించిన. ఈ ఏడాది సైతం టెన్త్ విద్యార్థులందరికీ మరో 20 వేల సైకిళ్లను ఉచితంగా అందిస్తా. ఎంపీగా గెలిపించిన కరీంనగర్ ప్రజల కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తా. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా క్రుషి చేస్తా.

# ఓట్లు సీట్లు ఇవ్వలేదని ఖమ్మం జిల్లాపై బిఆర్ఎస్ కక్ష

**ఖమ్మం / హైదరాబాద్ వెలుతురు జూలై 16:-**



బిఆర్ఎస్ పార్టీని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఎప్పుడూ సరిగా ఆదరించడంలేదన కక్షతో అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్ట్‌తో పాటు పలు నీటి ప్రాజెక్ట్‌లను ఆ పార్టీ నాయకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. గురువారం నాడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార ్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను మంత్రిగారు సందర్శించారు. ప్రాజెక్ట్ సందర్శన అనంతరం ఏర్పాటైన పాత్రికేయుల సమావేశంలో మంత్రి గారు మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ పరిస్థితిని చూస్తే కడుపుతరుక్కుపోతోందని అన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీకి ఈ ప్రాంతీయులు ఓట్లు వేసి సీట్లు ఇవ్వనందున గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఉపయుక్తమైన సీతారామ ప్రాజెక్ట్‌కు అన్యాయం చేశారు. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మళ్లీ వాటిని దశల వారీగా అభివృద్ధి చేస్తున్నాం. ఎటువంటి భేషిజాలకు, పట్టుదలకు పోకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసినా సీతారామ ప్రాజెక్ట్ తో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సరిదిద్దే తపనతో పనిచేస్తున్నాం. వారు కట్టారని కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను వదిలేయం, గిరిజనులకు ఉపయోగపడే సీతారామ ప్రాజెక్ట్ ల ప్రాధాన్యత గుర్తించి ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొని పూర్తిగా అందుబాటులోకి తెస్తాం.ఉన్న నిధులను బిఆర్ఎస్ పెద్దలు కొల్లగొడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ మరోవైపు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తోంది. రాష్ట్రంలో నీటిపారుదల రంగం కుంటుపడకుండా చర్యలు చేపడుతున్నాం. ఈ సీతారామ ప్రాజెక్ట్ కు గతంలో 115 కోట్ల రూపాయిలు మాత్రమే ఖర్చుచేసి వదిలేశారు. ఇప్పుడు నిధులిస్తూ 1480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాలకు తాగునీటిని కూడా అందిస్తున్నాం. 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేస్తూ కరువు వచ్చినా కాపాడేలా చేస్తున్నాం. అవసరమైతే అదనంగా నీటిని విడుదల చేస్తాం. రైతులకు నీరు ఇవ్వాలన్న తపనతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో చాలా గట్టిగా పనిచేస్తున్నాం. ప్రతిపక్షపాత్ర పోషించాల్సిన బిఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకొని అబద్దాలతో కాలంగడుపుతున్నారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టం గుర్తించని నాటి పెద్దలు ఇప్పుడు ఈ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూస్తూ జ్ఞానం తెచ్చుకోవాలి.. అని మంత్రి పొంగులేటి హితవు పలికారు.

# ఘనంగా ప్రారంభమైన దివ్యాంగ కళాకారిణి షేక్ నఫీస్ చిత్రకళా ప్రదర్శన

- ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించిన సీనియర్ జర్నలిస్ట్ పొన్నం రవీచంద్ర
- ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదు- పొన్నం రవిచంద్ర

**హైదరాబాద్ వెలుతురు జూలై 16:**

శారీరక అంగవైకల్యంతో కదలలేని స్థితిలో ఉన్న కూడా తన చిత్రాల ద్వారా భావాలను అద్భుతంగా షేక్ నఫీస్ వ్యక్త పరిచిందని సీనియర్ జర్నలిస్ట్, గద్దర్ అవార్డు గ్రహీత పొన్నం రవి చంద్ర అన్నారు. మాదాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సారంగి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఖాజా అఫ్రిది నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'హార్టేబుల్డ్' కళా ప్రదర్శనను ఆయన ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దివ్యాంగత అనేది ప్రతిభకు అడ్డంకి కాదని షేక్ నఫీస్ తన చిత్రాల ద్వారా నిరూపించిందని తెలిపారు. శరీరం సహకరించకపోయినా సంకల్పం ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చే యవచ్చని ఆమె జీవితం చెబుతున్నదని కొనియాడారు. ఇలాంటి కళాకారులను స మాజం గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, కళాకారుడికి అందించే ప్రోత్సాహమే అతిపెద్ద పురస్కారమని అన్నారు. నఫీస్ వంటి ప్రతిభావంతులకు మరింత గుర్తింపు, అవకాశాలు లభించాలని కోరుకుంటున్నానని, ఆమె కళను ప్రపంచానికి పరిచయం చేసిన సారంగి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు,



సీనియర్ జర్నలిస్ట్ ఖాజా అఫ్రిదిని అభినందిస్తూ ఆయన సేవలను, నఫీజ్ కళని కొనియాడారు.సినీ దర్శకుడు అక్షర కుమార్ మాట్లాడుతూ, నఫీస్ చి త్రాల్లో కనిపిస్తున్న భావవ్యక్తీకరణ, కళ పట్ల ఆమెకున్న అంకితభావం ఎంతో స్ఫూ ర్తిదాయకమని కొనియాడారు. దివ్యాంగుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి ఇలాంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.దివ్యాంగ కళాకా రిణి షేక్ నఫీస్ "హార్టేబుల్డ్" పేరిట జరుగుతున్నచిత్రకళా ప్రదర్శన జులై 17, 18 తేదీల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు జరుగుతుందని, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేసి నఫీస్ ను ప్రోత్సహించాలని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నటుడు సన్నీ పల్లె, జర్నలిస్టులు బత్తిని



వినయ్ కుమార్ గౌడ్, శివరాం రెడ్డి, మహేష్, కట్ట శివ రెడ్డి, యూనస్ ఫర్హాన్, మానస, రఘు మాందాటి, కావాలి శ్రీనివాస్ తదితరులు పాల్గొని



శారీరక అవరోధాలను అధిగమించి కళను జీ వన మార్గంగా ఎంచుకున్న నఫీస్ అనేక మం దికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ముదిరాజులకు పెద్దపీట..?

- ఐదుగురు వరకు చైర్మన్ పదవులు దక్కే అవకాశంపై ఆశాభావం
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు భీమ లక్ష్మణ్ ముదిరాజ్ పేరు కూడా ప్రధానంగా వినిపిస్తోంది.

**హైదరాబాద్ వెలుతురు జూలై 16:**



తెలంగాణలో త్వరలో భర్తీ కానున్న నామినేటెడ్ పదవుల్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత ప్రాధాన్యత కల్పించే అవకాశాలపై ఆ వర్గంలో ఆశాభావం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా నాలుగు నుంచి ఐదు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ముదిరాజ్ నాయకులకు దక్కే అవకాశం ఉందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది.సామాజిక సమతుల్యత, సేవా దృక్పథం, పార్టీ పట్ల అంకితభావాన్ని పరిగణనలోకి తీసుకుంటూ యువ నాయకత్వానికి కూడా కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు భీమ లక్ష్మణ్ ముదిరాజ్ పేరు కూడా ప్రధానంగా వినిపిస్తోంది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో పాటు రాష్ట్ర మంత్రులు, పార్టీ సీనియర్ నాయకత్వంతో ఎప్పటికప్పుడు సన్నిహితంగా ఉంటూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర, సామాజిక సేవ, ప్రభుత్వ పెద్దలు మరియు పార్టీ అధిష్ఠానంతో ఉన్న సత్సంబంధాలు, అలాగే ముదిరాజ్ సామాజిక వర్గం తరపున నిరంతరం సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్న తీరు వంటి అంశాలు భీమ లక్ష్మణ్ ముదిరాజ్‌కు కీలకమైన చైర్మన్ పదవి దక్కే అవకాశాలను బలపరుస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.నామినేటెడ్ పదవుల భర్తీ ద్వారా సామాజిక న్యాయం, యువ నాయకత్వానికి ప్రోత్సాహం, వెనుకబడిన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ నియామకాలు ఉండనున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# గురుకుల విద్యార్థుల సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం

**హైదరాబాద్, వెలుతురు జూలై 16:**

గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించే ఉద్దేశంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.గురువారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (TGSWREIS) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చైతన్యపురి మహిళా న్యాయ కళాశాల, ఇబ్రహీంపట్నం రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (RDC), సరూర్‌నగర్ బాలికల గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడిన మంత్రి వారి విద్యాభ్యాసం, హాస్టల్ నిర్వహణ, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, బోధన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ప్రధానంగా మూడు విద్యాసంస్థలు ఒకే ప్రాంగణంలో ఉండటం వల్ల తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.విద్యార్థుల సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న మంత్రి వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.అనంతరం హాస్టల్ గదులు, డైనింగ్ హాల్, వంటశాల, తరగతి గదులు,



గ్రంథాలయం, ప్రయోగశాలలు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణను మంత్రి స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత ప్రమాణాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. మెనూ ప్రకారమే రుచికరమైన, నాణ్యమైన భోజనం అందిస్తున్నారని విద్యార్థినులు మంత్రికి తెలిపారు.విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన మంత్రి, విద్యాసంస్థల్లో ఏ చిన్న సమస్య ఉన్నా నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మంత్రి, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లలను గురుకుల విద్యాసంస్థలకు పంపిస్తున్నందున వారి విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి తెలిపారు. అదే ఆలోచనతో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాసంస్థల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు.



విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను గణనీయంగా పెంచి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తు చేశారు."విద్య ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలోనే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. గురుకుల విద్యాసంస్థలు సామాజిక మార్పుకు కేంద్రాలుగా నిలవాలి. ప్రతి ఉపాధ్యాయుడు తమ బాధ్యతను సేవాభావంతో నిర్వర్తించి విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి" అని మంత్రి పేర్కొన్నారు.విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశంపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని, ఆకస్మిక తనిఖీలు కూడా అదే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమస్యలు గుర్తించిన చోట వెంటనే పరిష్కార చర్యలు చేపట్టి, గురుకులాలను దేశంలోనే ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.ఈ తనిఖీ లో TGSWREIS (FAC) కార్యదర్శి శ్రీమతి కంభంపాటి శారద,స్టేట్ ఆఫీసర్ నిర్మల, ప్రిన్సిపాల్ సరూర్నగర్ గర్ల్స్ స్కూల్ కృష్ణ ప్రభలా , డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

# ఘనంగా తొలి 'తెలంగాణ స్కిల్స్ డే' వేడుకలు

- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 1,775 మంది విద్యార్థులకు ఉద్యోగాలు
- ఆఫర్ లెటర్లు పంపిణీ చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి గారు
- జర్మన్, జపనీస్ తదితర భాషల శిక్షణ కోసం EFLUతో కీలక ఒప్పందం
- తెలంగాణను దేశంలోనే నంబర్-1 స్కిల్ స్టేట్‌గా తీర్చిదిద్దుతాం

**హైదరాబాద్, వెలుతురు జూలై 16:**




నైపుణ్యమే యువత జీవితాలను మార్చే అసలైన శక్తి అని, ప్రతి యువకుడికి నాణ్యమైన శిక్షణతో పాటు ఉద్యోగం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీస్) మరియు గనులు శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (డీఈటీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కొమరం భీం ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తొలి 'తెలంగాణ స్కిల్స్ డే' కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఉద్యోగాలు సాధించిన శిక్షణార్థులను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన యువతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. అలాగే విదేశీ ఉపాధి అవకాశాల కోసం ఎంపికైన 19 మంది ఫిజియోథెరపిస్టులకు ఆఫర్ లెటర్లను కూడా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ప్రతి పరిశ్రమ మొదట అడిగేది స్కిల్డ్ మ్యాన్‌పవర్ గురించేనని అన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను దేశంలోనే నంబర్-1 స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. గతంలో ఐటీఐల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందలేకపోయారని, ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐలను టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేసినట్లు మంత్రి తెలిపారు. సీఎన్‌సీ, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ టూల్స్, ఆటోమేషన్ వంటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 6 దీర్ఘకాలిక, 23 స్వల్పకాలిక కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ మార్పులతో రాష్ట్రంలో శిక్షణ సామర్థ్యం 18,484 నుంచి 34,344 మందికి పెరిగిందని, 2025–27 విద్యాసంవత్సరంలో 99 శాతం సీట్లు భర్తీ కావడం యువతలో ఈ కోర్సులపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం 65 ప్రభుత్వ ఐటీఐల్లో 35 ట్రేడ్లలో 15,860 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ (డీజీటీ) ప్రమాణాల ప్రకారం శిక్షణ పూర్తిచేసిన వారికి జాతీయ స్థాయి ఎన్‌సీవీటీ సర్టిఫికేషన్ లభిస్తోందని, దీంతో ప్రభుత్వ, ప్రైవేట్, కేంద్ర సంస్థలతో పాటు విదేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం కలుగుతోందన్నారు.ష్నైడర్, సీమెన్స్, ఇండో–జర్మన్ గ్రీన్ స్కిల్స్ ప్రోగ్రామ్, ఎడ్యునెట్ ఫౌండేషన్, నిర్మాణ్ ఫౌండేషన్ వంటి సంస్థలతో భాగస్వామ్యం ద్వారా శిక్షకులకు శిక్షణ, ఆన్–ది–జాబ్ ట్రైనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. టాటా టెక్నాలజీస్ సామాజిక బాధ్యతలో భాగంగా భారీగా పెట్టుబడులు పెట్టి ఆధునిక ల్యాబ్‌లు, యంత్రాలు, ఫ్యాకల్టీని అందించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు.ఈ చర్యల ఫలితంగా హైదరాబాద్, ఉట్నూర్, వరంగల్, నిజామాబాద్, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఏడు



జాబ్‌మేళాల్లో 116 పరిశ్రమలు పాల్గొనగా, 2,572 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరై 1,775 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని మంత్రి తెలిపారు. ఇందులో 1,216 మంది ఏటీసీ విద్యార్థులు, 559 మంది ఐటీఐ విద్యార్థులు ఉన్నారన్నారు. ఎంపికైన వారికి సగటున రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నెలవారీ వేతనంతో ఉద్యోగాలు లభించాయని తెలిపారు.విదేశీ ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం జర్మన్, జపనీస్‌తో పాటు ఇతర విదేశీ భాషల్లో శిక్షణ అందించేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (EFLU)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జర్మనీలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల అవసరం ఉందని, భాషా నైపుణ్యాలు నేర్చుకుంటే తెలంగాణ యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉన్నత వేతనాలతో ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఇటీవల జర్మనీ పర్యటనలో అక్కడి ప్రభుత్వ ప్రతినిధులు తెలంగాణలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రశంసించారని వెల్లడించారు.విద్యార్థులు శిక్షణను మధ్యలో విడిచిపెట్టకుండా పట్టుదలతో పూర్తిచేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ఐటీఐ, ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2,000 స్టైపెండ్ అందించనుందని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు నిధుల కొరత రానివ్వబోమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రస్థాయి స్కిల్ కాంపిటీషన్లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరిస్తామని ప్రకటించారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు అలుమ్నీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాల సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక నైపుణ్య శిక్షణను విస్తరించేందుకు 54 కొత్త అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఇప్పటికే 281.39 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించామని మంత్రి తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో 50 వేల మంది యువతకు శిక్షణ అందించడమే లక్ష్యమని చెప్పారు. అలాగే జూలై 26 నుంచి ఆగస్టు 30 వరకు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో మరో విడత భారీ జాబ్‌మేళాలు నిర్వహించి 10 వేల మందికి పైగా యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.తెలంగాణ యువత నైపుణ్యాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లి, శిక్షణ నుంచి ఉద్యోగం వరకు సమగ్ర వ్యవస్థను నిర్మించడం ద్వారా రాష్ట్రాన్ని దేశంలోనే స్కిల్ డెవలప్‌మెంట్‌లో నంబర్–1 రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు.

# కులరహిత భారతమే నిజమైన స్వాతంత్ర్యం

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అని మనం గర్వంగా చెప్పుకుంటాం. ప్రపంచంలోనే అత్యంత సమగ్రమైన రాజ్యాంగాన్ని కలిగి ఉన్న దేశంగా మనల్ని మనం ప్రశంసించుకుంటాం. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే విలువలను రాజ్యాంగ పీఠికలో చెక్కించుకున్న దేశంగా ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని ఆశిస్తాం. అయితే ఈ గొప్ప ఆశయాలన్నింటి మధ్య నేటికీ భారత సమాజాన్ని లోపల నుంచి కొరుకుతున్న ఒక తీవ్రమైన సామాజిక వ్యాధి ఉంది. అదే కులవ్యవస్థ.

కులం అనేది కేవలం ఒక సామాజిక గుర్తింపు కాదు. అది వేలాది సంవత్సరాలుగా మనుషులను పుట్టుక ఆధారంగా ఉన్నతులు, అధములు అని విభజించిన ఒక అమానవీయ వ్యవస్థ. ఒక మనిషి ఏ కుటుంబంలో పుట్టాడన్న కారణంతోనే అతని వృత్తి, గౌరవం, అవకాశాలు, సామాజిక స్థానం నిర్ణయించబడే పరిస్థితి ప్రపంచంలోని చాలా సమాజాల్లో కనిపించదు. కానీ భారతదేశంలో మాత్రం ఈ వ్యవస్థ శతాబ్దాల పాటు సామాజిక జీవితాన్ని శాసించింది.

వేదకాలంలో ఏర్పడిన చాతుర్వర్ణ వ్యవస్థ కాలక్రమేణా వేలాది కులాలు, ఉపకులాలుగా విస్తరించింది. ప్రారంభంలో వృత్తి ఆధారంగా ఉన్నదని కొందరు వాదించినా, అది క్రమంగా జన్మ ఆధారిత వ్యవస్థగా మారిపోయింది. ఒకసారి ఏ కులంలో జన్మిస్తే జీవితాంతం అదే కులంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్య, ఆస్తి, దేవాలయ ప్రవేశం, సామాజిక సంబంధాలు, వివాహాలు అన్నీ కుల నియంత్రణలోకి వెళ్లిపోయాయి. ఈ వ్యవస్థలో శూద్రులు, ముఖ్యంగా దళితులు అత్యంత తీవ్రమైన సామాజిక వివక్షను ఎదుర్కొన్నారు. తోటి మనుషులనే అంటరానివారిగా చూడడం మానవ నాగరికతకు మచ్చగా నిలిచింది.

ఒక దేశం ఎంత అభివృద్ధి చెందినా, అంతరిక్షంలో విజయాలు సాధించినా, ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదిగినా, తన సొంత ప్రజల్లో కొందరిని మనుషులుగా కూడా గౌరవించలేకపోతే ఆ అభివృద్ధికి సంపూర్ణ అర్థం ఉండదు. కులం పేరుతో మనిషిని అవమానించడం, వివక్ష చూపడం, హింసించడం కేవలం చట్టవిరుద్ధమే కాదు, మానవత్వానికి కూడా విరుద్ధం.

బ్రిటిష్ పాలనతో భారతదేశంలో పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరించాయి. విద్య, పరిశ్రమలు, పట్టణీకరణ, ఆధునిక ఉద్యోగాలు అభివృద్ధి చెందాయి. దీనివల్ల కులవ్యవస్థలో కొన్ని మార్పులు వచ్చినా, దాని మూల స్వరూపం పూర్తిగా మారలేదు. ఒకే కులంలో ఆర్థికంగా భిన్న వర్గాలు ఏర్పడ్డాయి. ఒకే వర్గంలో వివిధ కులాలకు చెందినవారు కనిపించడం ప్రారంభమైంది. అయినప్పటికీ సామాజికంగా వెనుకబడిన వర్గాలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ఆర్థిక అసమానతలు, సామాజిక వివక్ష ఒకదానికొకటి బలాన్ని ఇచ్చుకుంటూ నేటికీ కొనసాగుతున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించింది. అంటరానితనాన్ని నేరంగా ప్రకటించింది. సమాన అవకాశాలు, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక రక్షణలను కల్పించింది. అయితే చట్టాలు మారినంత మాత్రాన సమాజపు మనస్తత్వం ఒక్క రోజులో మారలేదు. అందుకే రాజ్యాంగం చెప్పిన విలువలు పూర్తిగా సామాజిక జీవితంలో అమలుకావడానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.

ఈ మార్పు కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. ఆయన దృష్టిలో కులవ్యవస్థ అనేది కేవలం సామాజిక సమస్య మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి, మానవ గౌరవానికి, జాతీయ ఐక్యతకు అతిపెద్ద శత్రువు. అందుకే ఆయన "కుల నిర్మూలన"ను భారతదేశ సామాజిక పునర్నిర్మాణానికి మొదటి అర్హతగా భావించారు. రాజకీయ ప్రజాస్వామ్యం మాత్రమే సరిపోదని, దానికి సామాజిక ప్రజాస్వామ్యం తోడైతేనే నిజమైన స్వేచ్ఛ సాధ్యమని ఆయన పదేపదే హెచ్చరించారు.

అంబేద్కర్ కలలుగన్న సమాజంలో ఒక మనిషి విలువ అతని పుట్టుకతో నిర్ణయించబడదు. అతని ప్రతిభ, విద్య, కృషి, నైతికత మాత్రమే అతని స్థానాన్ని నిర్ణయిస్తాయి. సమాన అవకాశాలు అందరికీ అందుబాటులో ఉండాలి. విద్య ప్రతి ఒక్కరి హక్కు కావాలి. ఆర్థిక వనరులు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకూడదు. భూమి, ఉపాధి, పరిశ్రమలు, విద్య వంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించకుండా సామాజిక సమానత్వం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే, శ్రీ నారాయణ గురు, పెరియార్ ఈ.వి.రామస్వామి వంటి మహనీయులు కూడా కుల వివక్షకు వ్యతిరేకంగా గొప్ప ఉద్యమాలు నడిపారు. వీరందరి ఉద్యమాల లక్ష్యం ఒకటే—మనిషిని మనిషిగా గౌరవించే సమాజ నిర్మాణం. వారి మార్గాలు వేర్వేరైనా, అంతిమ లక్ష్యం సమానత్వమే.

అయితే నేటి పరిస్థితిని పరిశీలిస్తే కులం కేవలం సామాజిక గుర్తింపుగానే కాకుండా రాజకీయ సాధనంగా కూడా మారింది. ఎన్నికల సమయంలో కుల సమీకరణలు, అధికార పంపకాలలో కుల లెక్కలు, వివాహాల్లో కుల పరిమితులు, విద్యా సంస్థల్లో, ఉద్యోగాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్న వివక్ష మన సమాజం పూర్తిగా మారలేదని తెలియజేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కులాంతర వివాహాలు చేసిన యువతపై దాడులు, దళితులపై జరుగుతున్న అత్యాచారాలు, సామాజిక బహిష్కరణలు మన మనస్సాక్షిని ప్రశ్నిస్తున్నాయి.

కులరహిత సమాజం అంటే కులాలను బలవంతంగా మర్చిపోవడం కాదు. కులం కారణంగా ఎవరికీ ప్రత్యేక హక్కులు గానీ, అవమానాలు గానీ ఉండకూడదనే విలువను సమాజం స్వీకరించడం. పుట్టుక కాదు, ప్రతిభ ముఖ్యం అనే భావన ప్రతి ఇంట్లో, ప్రతి పాఠశాలలో, ప్రతి కార్యాలయంలో, ప్రతి ప్రజాస్వామ్య సంస్థలో బలపడాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే మానవ సమానత్వం గురించి బోధించాలి. కుల విద్వేషాన్ని పెంచే ఆలోచనలను నిరాకరించాలి.

రాజ్యాంగం మనకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూడు గొప్ప విలువలను అందించింది. అయితే ఈ విలువలు కేవలం పుస్తకాలలోనే మిగిలిపోతే ప్రయోజనం లేదు. అవి ప్రతి పౌరుడి ఆచరణలో ప్రతిబింబించాలి. ప్రభుత్వాలు చట్టాలను కఠినంగా అమలు చేయాలి. విద్యా వ్యవస్థ సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలి. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. రాజకీయ పార్టీలు కుల విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలను మానుకోవాలి. పౌర సమాజం పరస్పర గౌరవాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాలి.

భారతదేశ భవిష్యత్తు కుల సంఘర్షణల్లో లేదు, సామాజిక సమానత్వంలో ఉంది. దేశ అభివృద్ధి కేవలం ఆర్థిక వృద్ధితో కొలవబడదు. చివరి మనిషి కూడా గౌరవంగా జీవించే అవకాశాన్ని పొందినప్పుడే అది నిజమైన అభివృద్ధి అవుతుంది. ఒక దళిత బాలుడు, ఒక ఆదివాసీ బాలిక, ఒక వెనుకబడిన వర్గానికి చెందిన యువకుడు, ఒక అగ్రవర్ణ కుటుంబానికి చెందిన యువతి, వీళ్లందరూ ఎలాంటి వివక్ష లేకుండా సమాన అవకాశాలతో ఎదగగలిగితేనే భారత రాజ్యాంగం విజయవంతమైనట్టవుతుంది.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలగన్న భారతదేశం కుల ద్వేషంతో విభజించబడిన దేశం కాదు, సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన గౌరవంతో ప్రతి పౌరుడు జీవించే ప్రజాస్వామ్య భారతదేశం. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ కొద్దిమందికి మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరికీ చేరాలి. సమానత్వం చట్టపుస్తకాలలో మాత్రమే కాకుండా సామాజిక జీవితంలోనూ కనిపించాలి. సౌభ్రాతృత్వం నినాదంగా కాకుండా జీవన విధానంగా మారాలి.

భారతదేశం నిజమైన అర్థంలో విశ్వగురువుగా ఎదగాలంటే ముందు తన సొంత ప్రజల మధ్య ఉన్న కుల గోడలను కూల్చాలి. పుట్టుక కాదు, మానవత్వమే మనిషి గుర్తింపు అనే భావన ప్రతి భారతీయుడి హృదయంలో స్థిరపడాలి. అదే అంబేద్కర్‌కు నిజమైన నివాళి. అదే రాజ్యాంగానికి నిజమైన గౌరవం. అదే స్వాతంత్ర్యానికి సంపూర్ణ అర్థం. అదే కులరహిత, సమానత్వ భారత నిర్మాణానికి మార్గం.

మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# రంగులు మార్చే నైజం.. నమ్మకాన్ని చంపేస్తున్న స్వార్థం



ప్రకృతి వైచిత్రంలో పాము తన చర్మాన్ని విసర్జించడం అత్యంత సహజమైన ప్రక్రియ. లోపల పెరిగిన శరీరానికి పాత చర్మం ఇరుకుగా మారినప్పుడు, జీవన గమనాన్ని సాగించడానికి అది పాత పొరను వదిలేసి, సరికొత్త రూపంతో ముందుకు సాగుతుంది. ఇది దాని మనుగడకు, శారీరక ఎదుగుదలకు అనివార్యమైన జైవిక చర్య. అయితే, ఈ ఆధునిక కాలంలో పాము చర్మం మార్చినట్లు మనిషి కూడా తన నైజాన్ని మారుస్తున్నాడా? అనే ప్రశ్న సామాజిక విశ్లేషకుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రశ్నలో కేవలం వ్యంగ్యం మాత్రమే లేదు, సమాజ నైతిక పతనానికి సంబంధించిన ఆందోళన, ఒక నిష్ఠుర సత్యం కూడా దాగి ఉన్నాయి. ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాల గమనాన్ని, నైతిక విలువల క్షీణతను ఈ ధోరణి స్పష్టం చేస్తోంది.మానవ జీవితంలో మార్పు అనేది నిరంతర ప్రక్రియ, అది ఆహ్వానించదగ్గ పరిణామం కూడా. బాల్యంలోని ఆలోచనలు, వయసు పెరిగే కొద్దీ అనుభవాల ఆధారంగా పరిణతి చెందడం సహజం. విస్తృతమైన లోకానుభవం మనిషిలో వివేకాన్ని, విచక్షణను పెంచుతుంది. ఈ సానుకూల కోణంలో చూస్తే, మనిషి తన ఆలోచనా విధానంలో మార్పులు చేసుకోవడం అనేది పాము చర్మం మార్చడం లాంటిదే. లోపల ఎదిగిన వ్యక్తిత్వానికి పాత మూఢనమ్మకాలు, సంకుచిత అలవాట్లు సరిపోనప్పుడు, వాటిని నిర్మొహమాటంగా వదిలేసి ప్రగతిశీల ఆలోచనలతో ముందుకు సాగడం ఆరోగ్యకరమైన సామాజిక పరిణామం. ఒక విద్యార్థి తన బద్ధకాన్ని విడనాడి కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవడం, ఒక తీవ్ర కోపిష్టి నిరంతర సాధనతో సహనాన్ని పెంపొందించుకోవడం వంటివి సమాజ హితాన్ని కోరే సానుకూల మార్పులు. ఇటువంటి మార్పులు వ్యక్తిగత వికాసానికే కాకుండా, సమష్టి సమాజ అభ్యున్నతికి ఎంతో దోహదం చేస్తాయి. కానీ, అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమవుతోంది అంటే, మనిషి తన నైజంలోని స్వార్థాన్ని, కుటిలత్వాన్ని కప్పిపుచ్చుకోవడానికి నిరంతరం వేషాలు, రంగులు మార్చుకుంటున్నప్పుడే సామాజిక సంక్షోభం ఏర్పడుతోంది.నేటి యాంత్రిక సమాజంలో మెజారిటీ జనాభా తమ మాటలను, చేతలను, వైఖరులను కేవలం లబ్ధిని చేకూర్చే పరిస్థితులను బట్టి మార్చేసుకుంటున్నారు. ముఖ్యంగా రాజకీయ రంగంలో ఈ ధోరణి పరాకాష్టకు చేరింది. అధికార పీఠంపై ఉన్నప్పుడు ఒకలా మాట్లాడి, ప్రతిపక్ష స్థానంలోకి రాగానే పూర్తి భిన్నమైన గొంతుక వినిపించే నాయకులను మనం నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. నిన్నటివరకు ఒక నిర్దిష్ట సిద్ధాంతాన్ని గుడ్డిగా సమర్థించిన ప్రజాప్రతినిధులు, ఈరోజు తమ తక్షణ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఆ సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేక వైఖరిని అవలంబించడం సర్వసాధారణమైపోయింది. ఇది ప్రకృతిసిద్ధమైన మార్పు ఎంతమాత్రం కాదు, కేవలం అధికార కాంక్షతో వేసుకునే ముసుగుల మార్పిడి మాత్రమే. పాము తన అసలు స్వభావాన్ని, విష తీవ్రతను కోల్పోకుండా కేవలం చర్మాన్ని మాత్రమే మారుస్తుంది. కానీ నేటి అవకాశవాద మనుషులు తమ అంతరాత్మను చంపుకుని, నైతిక విలువలను పూర్తిగా గంగలో కలిపేసి కేవలం క్షణిక లాభాల కోసం రంగులు మారుస్తున్నారు.వ్యక్తిగత బంధుత్వాలు, స్నేహ సంబంధాల్లో కూడా ఇదే తరహా నైజం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అవసరం ఉన్నంతవరకు అత్యంత ఆప్యాయంగా నటిస్తూ, ఆ అవసరం తీరిపోగానే కనీసం గుర్తుపట్టనట్లు మొహం చాటేసే స్వార్థపరులు ఎందరో సమాజంలో తిరుగుతున్నారు. ప్రాచీన కాలం నుండి పవిత్రంగా భావించబడుతున్న స్నేహం, బంధుత్వం, ప్రేమ వంటివన్నీ నేడు లాభనష్టాల లెక్కల మీద ఆధారపడే వ్యాపార లావాదేవీలుగా రూపాంతరం చెందుతున్నాయి. ఇటువంటి నకిలీ మార్పుల వల్ల మనుషుల మధ్య ఉండాల్సిన పరస్పర నమ్మకం, విశ్వసనీయత పూర్తిగా దెబ్బతింటున్నాయి.

ప్రస్తుత డిజిటల్ యుగంలో, సోషల్ మీడియా విస్తృతి పెరిగిన తర్వాత ఈ కృత్రిమ ధోరణి మరింత వికృతంగా తయారైంది. ఒక వ్యక్తి తన నిజ జీవితంలో అత్యంత సాధారణంగా లేదా కఠినంగా ఉంటూ, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో మాత్రం తానే అద్భుతమైన మానవతావాదిగా, ఆదర్శమూర్తిగా ప్రదర్శించుకోవడం నిత్యకృత్యమైంది. ఇక్కడ చర్మం మార్చడం అనేది కేవలం సామెత కాదు, సాంకేతిక పరిజ్ఞానంతో అక్షరాలా నిజమవుతోంది. ఫోటో ఎడిటింగ్ ఫిల్టర్ల నుండి మొదలుకొని, సమాజంలో ట్రెండింగ్‌లో ఉన్న అంశాలపై వ్యక్తపరిచే నకిలీ అభిప్రాయాల వరకు అన్నింటినీ కేవలం లైకులు, కామెంట్లు, ప్రేక్షకుల మెప్పు కోసమే మలచుకుంటున్నారు. ఈ రకమైన కృత్రిమ వర్చువల్ వ్యక్తిత్వాలు సమాజంలో అసలైన, నిజాయితీ కలిగిన మనుషులను గుర్తుపట్టడాన్ని అత్యంత కష్టతరం చేస్తున్నాయి.పాము చర్మం మార్చడానికి, మనిషి ముసుగులు మార్చడానికి మధ్య ఒక ప్రాథమిక, గుణాత్మక తేడా ఉంది. పాము ఎన్నడూ ఇతర జీవులను మోసం చేయడానికి లేదా వంచించడానికి చర్మాన్ని విసర్జించదు. అది దాని శారీరక పెరుగుదలకు అవసరమైన ఒక జీవ లక్షణం మాత్రమే. కానీ మనిషి ప్రదర్శించే మార్పు వెనుక తరచుగా స్వార్థం, మోసం, పరపీడన, అవకాశవాదం వంటి దుర్గుణాలు దాగి ఉంటున్నాయి. అంతఃకరణ శుద్ధితో, ఆత్మపరిశీలనతో కూడిన మార్పు ఎప్పుడూ సమాజానికి స్వాగతించదగినదే. కానీ కేవలం స్వప్రయోజనాల కోసం మాత్రమే ముఖాలు మార్చుకునే కపట మార్పు సమాజ విచ్ఛిన్నానికి దారితీస్తుంది.ఇక్కడ మనం ఒక శాశ్వత సత్యాన్ని గుర్తుంచుకోవాలి. పాము ఎన్నిసార్లు చర్మాన్ని మార్చినా, దాని కాటులో ఉండే విషం ఎంతమాత్రం మారదు. అలాగే, పైపైన మనుషులు ఎన్ని రకాల ముసుగులు వేసుకున్నా, సమాజంలో ఎంతగా నటించినా, వారి అసలు కపట స్వభావం వారి చేతల్లో, క్లిష్ట సమయాల్లో బయటపడక మానదు. కాలం అనేది అత్యంత గొప్ప పరీక్షకుడు. మనిషి ఎంత నేర్పుగా తన అసలు రూపాన్ని దాచాలని ప్రయత్నించినా, నిజాయితీ లేని ఆ నకిలీ మార్పు ఎక్కువ కాలం సమాజంలో నిలబడలేదు.సారాంశమేమిటంటే, కాలంతో పాటు మారడం తప్పు కాదు, అది ప్రగతికి సూచిక. సమాజంలో ఉన్నతమైన వ్యక్తిగా ఎదగడానికి, నైతికంగా మెరుగుపడటానికి మార్పు ఎంతో అవసరం. కానీ ఆ మార్పు అంతర్గత నిజాయితీతో, ఆత్మవిమర్శతో కూడినదై ఉండాలి. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం, ఇతరులను వంచించడం కోసం రంగులు మార్చుకునేదిగా ఉండకూడదు. వర్తమాన సమాజం ఈ సూక్ష్మమైన తేడాను గుర్తించినప్పుడే, నిజమైన వ్యక్తిత్వ వికాసానికి, కపట నటనకు మధ్య స్పష్టమైన విభజన రేఖ ఏర్పడుతుంది. ముగింపుగా చెప్పాలంటే, పాము చర్మం మార్చినా అది అదే పాముగా మిగులుతుంది; కానీ మనిషి ఎన్ని బాహ్య మార్పులు పొందినా, తన మానవత్వాన్ని, మూల నైతిక విలువలను కాపాడుకున్నప్పుడే సమాజంలో నిజమైన మనిషిగా గౌరవించబడతాడు. ప్రస్తుత కలుషిత సమాజానికి అత్యంత అవసరమైన నిజమైన పాఠం ఇదే.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలుకు...

(మొదటి పేజీ తరువాయి)

ఈ డిమాండ్ గతంలోనూ మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావించిన విషయమేనని వారు గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్లు స్వతంత్ర అంశమని, వాటిని ఇతర రాజకీయ లేదా పరిపాలనా ప్రక్రియలకు అనుసంధానం చేయడం వల్ల అమలు మరింత ఆలస్యమవుతుందని జేఏసీ అభిప్రాయపడింది. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మహిళా రిజర్వేషన్లను జనగణన, డిలిమిటేషన్ నుంచి వేరు చేసే సవరణను తీసుకురావాలని, ఒక మూడవ వంతు రిజర్వేషన్లను వెంటనే అమలు చేసేలా కాంగ్రెస్ పార్టీ తరఫున పార్లమెంట్‌లో చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.రాష్ట్ర శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం ప్రస్తుతం చాలా తక్కువగా ఉందని, త్వరలో పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల అమలు అత్యవసరమని జేఏసీ పేర్కొంది.ఈ వినతిపత్రంపై ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి , పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, పీఓడబ్ల్యూ–2 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వరూప, సీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. జ్యోతి సంతకాలు చేశారు.

# మాంచాలలో 10 గ్రామపంచాయతీ నూతన భవనాలకి 2 కోట్లు విడుదల చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో మంచాల మండలంలోని అన్ని గ్రామాలు పూ ర్తిస్థాయిలో అభివృద్ధి చేయిస్తాం
- కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బైరీక రమాకాంత్ రెడ్డి

**మంచాల వెలుతురు జులై 16:**

మాంచాలలో.మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బైరీక రమాకాం త్ రెడ్డి మాట్లాడుతూ గతపాలకులు గ్రామపంచాయతీలని పట్టించుకోలేదు ఇప్పుడు కాంగ్రెస్ ప్ర జా ప్రభుత్వంలో అభివృద్ధి ప్రదాత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారు రాజకీ యాలకు అతీతంగా ప్రతిగ్రామానికి మౌలిక వసతులకు సి సి రోడ్లు అండర్ డ్రైనేజ్ లు మరి యు ద్వాక్రాభవనలతో పాటు ఇప్పుడు మంచాల మండలంలోనీ10గ్రామ పంచాయతీలకు గా ను ఒకొక పంచాయతీకి20లక్షల చొప్పున 2 కోట్ల రూపాయలను ఈజీఎస్ నిధులను కేటాయిం చడం జరిగింది ఈగ్రామాలకు చీదేడ్, లింగంపల్లి తిప్పయిగూడా తాళ్ళపల్లి గూడా కొర్రవాని తాండా కాగజ్ ఘాట్ ఆగపల్లి రంగాపురం చిత్తపురం జపాల గ్రామాలకు గాను ప్రతి గ్రామనికి 20 లక్షల చొప్పుననిధులు కేటాయించడం జరిగింది అని అన్నారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మ ల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగాజరుగుతున్నా యి అనిఅన్నారు రాబోయే రోజుల్లో మంచాల మండలంలోని అన్ని గ్రామాలు పూర్తిస్థాయిలో అ భివృద్ధి చేయిస్తాం అనిఅన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఖబడ్దార్

- కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం
- జన్వాడ కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక

**శంకర్ పల్లి, వెలుతురు జులై 16 :**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, విద్యాభివృద్ధికి చేపడుతున్న విప్లవాత్మక చర్యలు ఎంతో ప్రశంసనీయమని జన్వాడ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు స్పష్టం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంతో పాటు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని వారు కొనియాడారు. మండల పరిధిలోని జన్వాడ ప్రభుత్వ పాఠశాలను ఒక ప్రముఖ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం మరియు కొంతమంది దాతల సహకారంతో అద్భుతంగా అభివృద్ధి చేయడం జరిగిందని, ఇందుకు గాను జన్వాడ గ్రామ ప్రజలు, నాయకులు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

**నిజానిజాలు తెలుసుకోకుండా వార్తలు రాయొద్దు**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలు, సంక్షేమ పథకాలను ఓర్వలేకనే గత ప్రభుత్వ నాయకులు తప్పుడు ప్రచారాలకు ఒడిగడుతున్నారని వారు తీవ్రంగా మండిపడ్డారు. అలాగే కొన్ని న్యూస్ పేపర్లు కూడా క్షేత్రస్థాయిలో నిజానిజాలు తెలుసుకొని వార్తలు రాయాలని హితవు పలికారు. ప్రభుత్వంపై జరుగుతున్న ఇటువంటి అసత్య, తప్పుడు ప్రచారాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.



**గత ప్రభుత్వం కంటే మెరుగైన వసతులు**

గత పాలకుల కంటే మెరుగైన విద్య, మౌలిక వసతులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తోందని నేతలు స్పష్టం చేశారు. విద్యారంగ సంస్కరణల్లో భాగంగా 2026 విద్యా సంవత్సరం నుండి విద్యార్థినీ విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్ (అల్పాహారం) అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే నన్నారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే విద్యార్థుల చేతుల్లోకి పాఠ్యపుస్తకాలు, డ్రెస్ మెటీరియల్స్ అందించిన ప్రజా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలు చేసే వారందరూ తక్షణమే తమ వైఖరిని మార్చుకోవాలని తీవ్రంగా హెచ్చరించారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ తలారి మైసయ్య, మాజీ సర్పంచ్ రాచురి ఐలయ్య, జన్వాడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలారి చంద్ర శేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగం ప్రేమదాస్, ఇందిరమ్మ కమిటీ మెంబర్ చిటికెరీ ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

# కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి డివిజన్‌లలో SIR 2026 హెల్ప్ డెస్క్ కార్యక్రమాలను ప్రారంభం

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 16:**




కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 286 కుత్బుల్లాపూర్ డివిజన్, 294 బహదూర్‌పల్లి డివిజన్ గ్రామంలోని హనుమాన్ టెంపుల్ పరిధిలో ఏర్పాటు చేసిన SIR-2026 హెల్ప్ డెస్క్ కార్యక్రమాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్లకు SIR-2026 ప్రక్రియపై అవగాహన కల్పించడం, అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియలో సహాయ సహకారాలు అందించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... SIR-2026 కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించడంలో హెల్ప్ డెస్క్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, సిద్ధనోళ్ళ సంజీవరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ రాహుల్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఆరుట్ల సుందరయ్యనగర్ లో సిసి రోడ్డు పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో ఆరుట్ల గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయిస్తాం
- కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం

**మంచాల వెలుతురు జులై 16:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంలో ప్రత్యేక నిధుల నుండి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి సహకా రంతో మంజూరైన నిధులతో ఆరుట్ల సుందరయ్యనగర్ శరవేగంగా జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ ప్రధానకార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీనాయకులు పరిశీలించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డిగారి సహకారంతో ఆరుట్ల గ్రా మాన్ని అన్ని విధాలుగా అన్ని మౌలిక వసతులతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయిస్తాం అనిఅ న్నారు కార్యక్రమంలో గ్రామకార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో జరిగిన ఈఇబ్రహీంపట్నంమా ర్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మాజీ ఎంపిటిసి లాలగారి శ్రీకాంత్ ఇందిరమ్మకమిటీ సభ్యు లు బుట్టి కృష్ణముదిరాజ్ కంబాలపల్లి బుగ్గరాములు కోరే బాబు కాంగ్రెస్ పార్టీ జిల్లానాయకులు మార సురేష్ కాంగ్రెస్ నాయకులు లచ్చగారి జంగారెడ్డి పంబాల కిషోర్ మహమ్మద్ అశ్రఫ్ ఆర్ల బీరుమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతన డీసీసీ ఉపాధ్యక్షులు నియామక పత్రం అందజేత

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 16:**



మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ ని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ ఉపాధ్యక్షునిగా నియమించారు.ఈ సందర్భంగా బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హన్మంతన్న శాలువాతో సత్కారించి ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ కి నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తోందన్నారు. ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, సంస్థాగత బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు అభిమానులు పాల్గొన్నారు.

# కష్టమర్ల మన్ననలు పొందినప్పుడే మంచి వ్యాపారం జరుగుతుంది:కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 16:**

కష్టమర్ల మన్ననలు పొందినప్పుడే మంచి వ్యాపారం జరుగుతుందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. గురువారం షాపూర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ ట్రేడర్స్ డ్రై ఫ్రూట్స్ అండ్ కిరాణం షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి షాప్‌ను ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ షాప్ యజమాన్యం మున్నాలాల్ బటియాకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూన రవీందర్ గౌడ్, కూన రాఘవేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, పూల్ చంద్ బాటి, మున్నాలాల్, సునీల్ బాటి, మాణిక్చంద్ బాటియా, అనిల్ బాటి, అఖిల్ గౌడ్, మక్బుల్ బాయ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# యుకె కు ఎగుమతులు పెంచుతాం: మంత్రి శ్రీధర్ బాబు

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యుకె సుంకాలను తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. యుకె డిప్యూటి ట్రేడ్ కమిషనర్ (దక్షిణాసియా) చంద్రు కె అయర్ (Chandru K Iyer) ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రతినిధి బృందంతో శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. సమావేశంలో ఎమ్మెల్సీ, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారీగా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. రెండు దేశాల మధ్య రూ.3.25 లక్షల కోట్ల (25 Billion Pounds) వాణిజ్యానికి అవకాశం ఉందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణాలో పారిశ్రామిక వస్తూత్పత్తి, లైఫ్ సైన్సెస్, ఏవియేషన్, డిఫెన్స్, ఐటి, సెమికండక్టర్స్, చిప్ ల డిజైన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసామని, యుకె పారిశ్రామికవేత్తలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రం నుంచి యుకెకు ప్రస్తుతం రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాల వల్ల ఎగుమతులను భారీగా పెంచుకునే అవకాశం ఏర్పడిందని వివరించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణాలోనే జరుగుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రానిదేనని శ్రీధర్ బాబు తెలిపారు. విమానయాన రంగానికి అవసరమైన ప్రిసిషన్ విడిభాగాల ఉత్పత్తిలో తెలంగాణా అగ్రస్థానంలో ఉందని గుర్తు చేసారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, డసో (Dassault) ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, సఫ్రాన్ ఏవియేషన్ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. హైదరాబాద్ లో ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా పలు ప్రఖ్యాత సంస్థలు 450 జిసిసి కేంద్రాలను ఏర్పాటు చేసాయని చెప్పారు. యుకెకు ఎగుమతి చేయగలిగే వస్తువుల తయారీపై స్థానిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి సిఇటిఏ ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఇండస్ట్రీస్ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆధిత్యకు శ్రీధర్ బాబు సూచించారు. యుకె నుంచి భారత్ పర్యటించే మేయర్ల బృందాన్ని హైదరాబాద్ ను కూడా సందర్శించేలా చూడాలని చంద్రు కె అయర్ ను మంత్రి కోరారు. అధికారులతో కలిసి యుకెను సందర్శించి అక్కడ పారిశ్రామిక, వాణిజ్య ఎకోసిస్టంను పరిశీలించాలని చంద్రు అయర్ శ్రీధర్ బాబును ఆహ్వానించారు. యుకె ప్రతినిధి బృందంలో సిద్దార్థ్ విశ్వనాథన్, నళిని రఘురామన్, ప్రవీణ్ పద్మనాభన్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీల నిర్వహణ పంచాయతీల బాధ్యతే

- ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్
- నర్సరీ అభివృద్ధికి సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ హామీ

**శంకర్ పల్లి, వెలుతురు జులై 16:**




మండల పరిధిలోని ఇరుగుంట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని, స్థానిక నర్సరీని శంకర్ పల్లి ఎంపీడీఓ వి. ప్రవీణ్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ రికార్డులను పరిశీలించి, కార్యాలయ నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం రేపటి నుంచి ప్రారంభం కానున్న 'వన మహోత్సవం' కార్యక్రమానికి సిద్ధం చేసిన గ్రామ పంచాయతీ నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. నర్సరీల నిర్వహణ పూర్తి బాధ్యత గ్రామ పంచాయతీలదేనని స్పష్టం చేశారు. వన మహోత్సవానికి నర్సరీని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నర్సరీలోని మొక్కలకు ప్రతిరోజు క్రమం తప్పకుండా నీరు పట్టాలని, షిఫ్టింగ్, గ్రేడింగ్ వంటి పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇరుగుంట గ్రామ సర్పంచ్ శ్రీ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ.. నర్సరీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, మొక్కల సంరక్షణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పంచాయతీ తరపున పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏపీఓ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సహకార రంగం పనితీరుపై ఇరాన్ ప్రతినిధి బృందానికి వివరించిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్, వెలుతురు జులై 16:**

రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత & జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామితో కలిసి ఈ రోజు సచివాలయంలో ఇరాన్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు.ఈ సమావేశంలో H.E. Dr. Meidari, ఇరాన్ సహకార, కార్మిక మరియు సామాజిక సంక్షేమ శాఖ మంత్రి, Dr. Sarfi, సహకార శాఖ ఉపమంత్రి, H.E. Dr. Mohammad Fath Ali, భారతదేశంలోని ఇరాన్ రాయబారి, H.E. Hamid Ahmadiyeh, హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్, Mr. Mohsin Moghaddami, వైస్ కాన్సుల్, Mr. Hashemi, ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణలో సహకార ఉద్యమం బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (PACS) పనితీరు, సభ్యత్వ విస్తరణ, రైతులకు అందిస్తున్న సేవలు, సహకార రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతిని మంత్రి తుమ్మల ప్రతినిధి బృందానికి వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందని, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు.తెలంగాణలో అమలవుతున్న సహకార విధానాలు, సంస్థాగత సంస్కరణలు, సభ్యులకు అందిస్తున్న సేవలపై ఇరాన్ ప్రతినిధి బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. భవిష్యత్తులో సహకార రంగంలో పరస్పర అనుభవాల మార్పిడి, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశాలపై ఇరు పక్షాలు చర్చించాయి.సమావేశం అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి ఇరాన్ ప్రతినిధి బృంద సభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ప్రతినిధి బృందం కూడా మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది.



# ఆహార భద్రత చట్ట సవరణను విరమించుకోవాలి

- **చట్టసవరణ పేరుతో పేదల వికలాంగుల పొట్టకొట్టొద్దు**
- **సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు**

**మోత్కూర్, జులై 16,వెలుతురు న్యూస్ :**

జాతీయ ఆహార భద్రత చట్టంలో చట్టసవరణ చేసి అంత్యోదయ, అన్నయోజన ద్వారా పేదలు వికలాంగులు పొందుతున్న 35 కేజీల బియ్యాన్ని తగ్గించాలనే ఆలోచనను, అంత్యోదయ రేషన్ కార్డులను రద్దు చెయ్యాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రోజున మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటికి చాల మంది ప్రజలు ప్రజా పంపిణి వ్యవస్థకు దూరంగా ఉన్నారని, అర్హులను గుర్తించి సంఖ్యను పెంచాల్సిన కేంద్ర ప్రభుత్వం, దానిని తగ్గించే ప్రయత్నం



చేస్తుందని విమర్శించారు. జాతీయ సమగ్ర కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో పేదరికంలో పిల్లలు ఎదుగుదల లేక, తక్కువ బరువుతో, రక్తహీనతతో బాధపడు తున్నారని, ఇలాంటి పరిస్థితిలో ఆహార భద్రతను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం చట్టాన్ని బలహీన పర్చడం సరికాదని, ప్రస్తుతం అంత్యోదయ అన్నయోజన క్రింద నిరుపేదలకు వికలాంగుల కుటుంబాలకు ప్రతి నెల 35 కిలోల బియ్యం అందుతున్నాయని, దానిని మార్చి ప్రతి వ్యక్తికి 7 కిలోల చొప్పున ఇవ్వాలనే ప్రతిపాదన వల్ల పేదకు టుంబాలు వికలాంగుల కుటుంబాలు తీవ్రంగా నష్టపో తారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని గొప్పలు చెపుతున్న మోడీ ప్రభుత్వం, ఆహార భద్రత చట్టానికి ఎందుకు సవరణ చేస్తుందని ప్రశ్నించ్చారు. పేదలు వికలాంగులు పెరిగిన ధరలు, మందులు తదితర అవసరాల ఖర్చులు భరిస్తున్న నేపథ్యంలో అంత్యోదయ పథకం వారికీ ఎంతో ప్రయోజనకరంగా ఉందని, ఈ ప్రయోజనం తగ్గించడం ద్వారా పేదల కడుపు కొట్టడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, జాతీయ పోషకాహార భద్రత చట్టాన్ని బలోపేతం చేసి, వికలాంగులకు పేదకుటుంబాలకు 35కిలోల బియ్యాని కొనసాగిస్తూ, తీవ్రవైకల్యం ఉన్నవారికి ఇంటి వద్దనే రేషన్ పంపిణి చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, కొంపల్లి గంగయ్య, దడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

- **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.**

**మోత్కూర్, జూలై 16, వెలుతురు న్యూస్ :**



అర్హులైన ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం అందాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మోత్కూర్ మండలం అనాజిపురం గ్రామంలోని జంగాల కాలనీలో గురువారం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను స్వయంగా పరిశీలించిన ఆయన, గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల వివరాలను పరిశీలించి అర్హులందరికీ ఇళ్ల మంజూరు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాలనీలో మొత్తం ఎన్ని గుడిసెలు ఉన్నాయో, వాటిలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు ఎన్ని కుటుంబాలు అర్హులయ్యాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుడిసెలను స్వయంగా సందర్శించి లబ్ధిదారుల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. అనంతరం మొదటి విడతలో మంజూరై ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభించారో, ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదలయ్యాయా లేదా అనే విషయంపై ఆరా తీశారు.నిర్దేశిత గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి త్వరితగతిన గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జ్యోతి, ఎంపీడీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**మోత్కూర్, జూలై 16,వెలుతురు న్యూస్ :**

మోత్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం నాడు ఆకస్మిక తనిఖీ చేశారు.ఆసమయంలో ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించిన ఆయన బెడ్‌షీట్లు సరిగా లేకపోవడాన్ని గమనించి సంబంధిత సూపర్‌వైజర్‌కు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. బెడ్‌షీట్లు అపరిశుభ్రంగా ఉంటే రోగులు ప్రభుత్వ ఆసుపత్రులకు ఎలా వస్తారు? అంటూ వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని స్పష్టం చేశారు. బెడ్‌షీట్లను ఎప్పటికప్పుడు మార్చి శుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రి వార్డులు, పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రిలో ప్రతి రోజు వచ్చే ఓపీ రోగుల సంఖ్య, అందిస్తున్న మందులు, నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల సమాచారం మొత్తం ఈ ఆరోగ్యం యాప్‌లో సకాలంలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. గర్భిణీల సేవలపై కూడా ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్, ఈ నెలలో ఉన్న ప్రసవాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగిన ప్రసవాల సంఖ్య, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించడానికి గల కారణాలపై వివరాలు సేకరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు, అత్యవసర వైద్య సేవలు, మందులు, పరీక్షలు అన్నీ అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆసుపత్రి ఆవరణలో నీరు నిల్వ ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి, వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచి విని యోగంలోకి తీసుకురావడంతో పాటు ఆసుపత్రి పరిస రాలను పూర్తిగా పరిశుభ్రం చేయాలని ఆదేశించారు.ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం



సహించబోమని హెచ్చరించిన కలెక్టర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో స్థానిక తహసిల్దార్ పి జ్యోతి, ఎంపీడీవో బాలాజీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుమన్, మెడికల్ ఆఫీసర్ నిరోషా, ఆయుష్ డాక్టర్ వీణ, జూనియర్ అసిస్టెంట్ షకీల్, ల్యాబ్ టెక్నీషియన్ జనార్ధన్, సూపర్వైజర్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# గుండాల కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- **గ్రామ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం:**
- **నూతన అధ్యక్షుడు కొనపర్తి భాస్కర్**

**గుండాల, జూలై 16 (వెలుతురు):**



గుండాల మండలంలోని గుండాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్త ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా కొనపర్తి భాస్కర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అన్నపర్తి మోష, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా మేకల రమేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా గోపాల్ దాస్ మహేష్‌ను ఎంపిక చేశారు. అలాగే గ్రామ శాఖ కార్యవర్గ సభ్యులను కూడా నియమించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొనపర్తి భాస్కర్ మాట్లాడుతూ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నాయకత్వంలో గుండాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో సైనికుడిలా పనిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏలూరి రామ్‌రెడ్డి, పొడిశెట్టి వెంకన్న గౌడ్, గుండాల మండల కాంగ్రెస్ నాయకులు, గుండాల సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య, చేనేత సహకార సంఘం చైర్మన్ చిందం ప్రకాష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ రెడ్డి, గుండాల ఉప సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్లు అన్నపర్తి యాదగిరి, జ్యోతి, నాగరాజు, నాయకులు దారా సైదులు, నాగమల్లు శ్రీనివాస్, శంకర్‌తో పాటు మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని రామన్నపేటలో మహాధర్నా

- **బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 16:**

విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9, ఆర్‌ఆర్ యాక్ట్ ను రద్దు చేయాలి. ప్రభుత్వ నాయకులు కమిషన్లు రావనే విద్యార్థుల స్కాలర్షిప్లు ఇవ్వట్లేదు విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని జీవో నెంబర్ 9ను ఆర్‌ఆర్ యాక్ట్ రద్దు చేయాలని వేల మంది విద్యార్థులతో రామన్న పేటలో మహా ధర్నా నాయకులకు పోలీసులకు వాగ్వాదం తదినంతరం శాంతియుతంగా ధర్నా ముగించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ ఎంపీఆర్.కృష్ణన్న, బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ ఆదేశం అనుసారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం జిల్లా అక్కినపల్లి సైదులు, బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, టిఆర్ఎస్ నాయకులు సురేష్, అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు. రామన్నపేట సుభాష్ సెంటర్లో మహాధర్నా రాస్తారోకో చేశారు విద్యార్థులు వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన 10 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుంది. ఈ ప్రభుత్వం, విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9ను ఆర్‌ఆర్ యాత్రను రద్దు చేయాలన్నారు. విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి, పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించాలి. విద్యాశాఖ మంత్రిని నియమించి వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి. వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి గాంధీ విగ్రహాలు పెట్టడానికమూసి సుందరీకరణ ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయి. గాని విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు



ఉండయా, ప్రభుత్వం స్కాలర్షిప్లు ఇవ్వక విద్యార్థులు అయోమ యానికి గురవుతున్నారు. కాలేజ్ యజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చెలమతనం లేదు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించింది. అన్నారు. ఇంజనీరింగ్ ఎంబీఏ ఎంసీఏ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలి. సంక్షేమ హాస్టల్స్‌కు సొంతభవనాలు నిర్మించాలి అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇవ్వాలి.

మెస్ చార్జీలు పెంచాలి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన విద్యార్థులకు 5 లక్షల లక్షల భరోసా కార్డు ఇవ్వాలి. 100రో జుల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి అధికా రంలోకి వచ్చాక విద్యార్థుల చావులపై పేలాలు ఏరుకుంటుంది. ప్రభుత్వం 100 రోజుల్లో రాజీవ్ గాంధీ ఇంద్రగాంధీ విగ్రహాలు తప్ప రాష్ట్ర ప్రజల బ్రతుకులు ఏమి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి. ప్రభుత్వాన్ని నిరుద్యోగులు జబ్బకు సంచేసుకొని ఊరూరు తిరిగి అధికారంలో తీసుకొస్తే ఈ ప్రభుత్వం నిలువున ముంచింది. హాస్టలకు సొంత భవనాలులేవు ఉన్న అద్దె కొంపలకు బెచ్చులూడి విద్యార్థులు చనిపోయే ప్రమాదం ఉన్న ఈ ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహ



రిస్తుంది. ఆర్ కృష్ణన్న కొట్లాడి విద్యార్థుల కోసం పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించే విధంగా పెట్టిస్తే ఆ జీవోను ఈ ప్రభుత్వం ట్రస్ట్ బ్యాంక్ పెడతామని తుంగలోకి దొరుకుతుంది. రాజకీయంగా ఆర్థికంగా విద్యా పరంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రవర్ణ ఎదవకుండా కుట్ర చేస్తున్నారు ప్రభుత్వం నాయకులు ఇక ఊరుకునే ప్రసక్తే లేదు. ఈ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి. పెంచిన ఫీజులన్నీ ప్రభుత్వమే భరించాలి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి. జనాభా తమాషా ప్రకారం గా ఎస్సీ ఎస్టీ బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి. విద్యారంగానికి నిధులు కేటాయించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఎంపీఆర్ కృష్ణన్ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు బస్సులు దానాలు చేసి ప్రభుత్వని అట్టుడికిస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం కార్యదర్శి అక్కెనపల్లి సైదులు, బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, టి ఎస్ ఎస్ ఏ ఊరెళ్ళ మహేష్ బీసీ సంఘం నాయకులు ఎడ్ల మహాలింగం, జినుకల కృష్ణ,బి ఆర్ఎస్ నాయకులు సురేష్, మనీష్, అనిత, లింగస్వామి, వినయ్, వెంకట్, భాస్కర్, రమాదేవి, ఉషశ్రీ, ఉదయ్ శ్రీ, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మలగూడెం గ్రామంలో రోడ్డు ప్రమాదం – ఒకరు మృతి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 16:**



పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమ్మలగూడెం గ్రామ సమీపంలో 15-07-2026 రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రామన్నపేట పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం, తుమ్మలగూడెం గ్రామానికి చెందిన చిన్నలచ్చి సాయిలు (69) తన TVS XL ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా, చిట్యాల వైపు నుండి భువనగిరి వైపు వెళ్తున్న hr 38 W 9712 నంబరు గల లారీ వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నలచ్చి సాయిలు రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా, విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య చిన్నలచ్చి నరసమ్మ ఫిర్యాదు మేరకు రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది.
స్టేషన్ హౌస్ ఆఫీసర్ రామన్నపేట పోలీస్ స్టేషన్

# వర్షాలు కురవాలని గ్రామదేవతలను వేడుకున్న మహిళలు

- **బొడ్రాయికి నీళ్లు పోసిన గ్రామస్తులు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 16:**




తుర్కపల్లి గ్రామంలో గ్రామ ప్రజలు వర్షాలు కురవాలని అమ్మవారిని వేడుకుంటూ గ్రామంలో ఉన్న బొడ్రాయికి బోనం పెట్టి నీళ్లు పోయడం జరిగినది. గ్రామస్తులంతా గ్రామదేవ తలను వేడుకొని గ్రామ ప్రజలను కాపాడాలని వర్షం వస్తే పాడిపంటలు చల్లగా ఉంటాయని అమ్మవారిని వేడుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చల్ల వరలక్ష్మి పిచ్చిరెడ్డి, ఉపసర్పంచ్ కన్నెబోయిన మల్లయ్య. వార్డ్ మెంబర్లు నకిరేకంటి ప్రశాంత్, చిట్టి మల్ల చంద్రకళ, చిట్టి మల్ల లక్ష్మి, చిట్టిమల్ల అంజయ్య గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామదేవతలను వేడుకున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు భరోసా

**మునుగోడు,జూలై 16(వెలుతురు):**


ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) గొప్ప భరోసాగా నిలుస్తోందని చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటీ నారాయణ అన్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 48 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దోటీ నారాయణ మాట్లాడుతూ అనారోగ్యం తదితర కారణాలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తోం దన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని చెప్పారు.ప్రజలకు అవస రమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం అభినందనీయమని, సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ త్వరితగతిన సహాయం అందేలా చర్యలు కొనసాగుతు



న్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ సర్పంచులు,మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చినలచ్చి సాయిలు మృతదేహానికి నివాళుల ర్పించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 16:**



గ్రామం ఇంద్రపాలనగరం నిన్న జరిగిన రోడ్డు ప్రమాదం లో అకాల మరణం చెందిన చినలచ్చి సాయిలు మృతుదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చిన ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, మందడి విద్యాసాగర్ రెడ్డి,మంటి లింగస్వామి,మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య,రాస వెంకటేష్,రేపాక సత్తయ్య, మాజీ ఉపసర్పంచ్ గర్ధాస్ వెంకటేష్,చిన్నపాక శ్రీనివాస్, నక్క వెంకటేష్, కాటేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడైన ఓటరు SIRలో పాల్గొనాలి

- **జహీరాబాద్-2 బీజేపీ టౌన్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి బసంతపూర్...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 16:**



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పని సరిగా పాల్గొని, తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్–2 బీజేపీ టౌన్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి బసంతపూర్ కోరారు.గురువారం రంజోల్ గ్రామంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో ఆయన స్వయంగా తన SIR దరఖాస్తును బూత్ లెవల్ ఆఫీసర్ (BLO) కు సమర్పించారు.అనంతరం జహీరాబాద్ పట్టణంలో కొనసాగుతున్న SIR కార్యక్రమంపై బీజేపీ BLA–2లు, BLAలతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితాలో ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు సక్రమంగా నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు.ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా బలమైన ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్న రమేష్ రెడ్డి, ప్రజలు SIR ప్రక్రియను సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన దరఖాస్తులను గడువులోగా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

# SIR ప్రక్రియలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా మిస్ కాకూడదు

- **నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఏ. చంద్రశేఖర్....**
- **నియోజకవర్గ కాంగ్రెస్ నేతలతో సమీక్షా సమావేశం....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 16:**





ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (SIR) కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో మరింత వేగవంతం చేసి, ఒక్క అర్హుడైన ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా పార్టీ శ్రేణులు పనిచేయాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.జహీరాబాద్ పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి సమక్షంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల బూత్ లెవెల్ ఏజెంట్లు (BLAలు)తో SIR కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా SIR కార్యక్రమం పురోగతి, ఓటరు నమోదు, ఎన్యూమరేషన్ ఫారాల భర్తీ, ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రతి అర్హుడైన ఓటరును జాబితాలో నమోదు చేయడం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.డాక్టర్ ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలకమని అన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయాలని, ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా పార్టీ నాయకులు, కోఆర్డినేటర్లు, BLAలు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయం అందిస్తూ SIR నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాజీ ఇండస్ట్రియల్ చైర్మన్ తన్వీర్, కాంగ్రెస్ నాయకుడు ఉజ్వల్ రెడ్డి, అసెంబ్లీ కోఆర్డినేటర్ మహమ్మద్ గౌస్, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, కోహిర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్, సీడీసీ చైర్మన్ ఎండీ ముబీన్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మండల అధ్యక్షులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, BLAలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# SIR ఫారాలు సమర్పించిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

- **ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించు కోవాలి: ఎమ్మెల్యే...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 16:**



సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసి SIR (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఫారాలను సంబంధిత అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను అధికారులు పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్న ఆయన, ఓటర్లందరూ తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకుని సంబంధిత BLOలు లేదా అధికారులకు SIR ఫారాలను వీలైనంత త్వరగా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు జగదీష్, గ్రామ సర్పంచ్ వినోద్ బాల్‌రాజ్, సర్పంచులు రాజు, శివమణి, రాజ్‌కుమార్, నాగేందర్, సోహైల్, నాయకులు వెంకట్‌రెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, BLOలు, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం

- **కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తో కలిసి రథయాత్రలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు జూలై 16:**





కరీంనగర్ నగరంలో ఇస్కాన్ (ISKCON) మరియు శ్రీ రాధా గోవింద మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో గౌరవ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ శ్రీ బండి సంజయ్ కుమార్ గారితో కలిసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొని జగన్నాథుని రథాన్ని భక్తులతో కలిసి లాగి రథయాత్రను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రథంపై కొలువై ఉన్న శ్రీ జగన్నాథ స్వామివారిని దర్శించుకోవడం ప్రతి భక్తుడి జన్మను ధన్యం చేస్తుందని పేర్కొన్నారు. జగన్నాథుని ఆశీస్సులు కరీంనగర్ నగర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. నగరంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో సోదరభావం, సద్భావన, ఆధ్యాత్మిక చైతన్యం మరింత పెంపొందుతాయని అన్నారు.నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, శ్రీ జగన్నాథ రథయాత్ర భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ మహోత్సవం నగర ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను మరింత పెంపొందిస్తుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు ఇస్కాన్ సంస్థ, నిర్వాహకులు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ మహోత్సవంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావ్ గారు, కార్పొరేటర్లు, శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ ప్రతినిధులు, డాక్టర్ నరహరి దాస్, కన్న కృష్ణ , డాక్టర్ ఎన్. రాధాకృష్ణ రెడ్డి, డాక్టర్ ఇ. విజయేందర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, కెప్టెన్ వడ్ల మధుసూధన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఇస్కాన్ నిర్వాహకులు, వివిధ సంఘాల ప్రతినిధులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొని శ్రీ జగన్నాథ స్వామివారి ఆశీస్సులు పొందారు.

# అక్రమ కేసులు బనాయించారంటూ బీఆర్ఎస్ నేతల ఆరోపణ

- **జహీరాబాద్ కోర్టులో హాజరై బెయిల్ పొందిన నాయకులు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 16:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తమపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో అక్రమంగా కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి గురువారం జహీరాబాద్ కోర్టుకు హాజరైన మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ, సీనియర్ నాయకులు నామా రవికిరణ్, కొమారి జగదీష్, ఆనందం, ఎర్రోళ్ల శివప్ప, రాథోడ్ భీంరావ్, హీరు రాథోడ్ బెయిల్ పొందారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, 2025 జూలై 19న జహీరాబాద్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సెట్విన్ సంస్థ అధికారిక కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా స్టేజ్ బ్యానర్‌లో స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఫొటో లేకపోవడంపై కార్యక్రమం ముగిసిన అనంతరం అధికారులను ప్రశ్నించి నిరసన వ్యక్తం చేశామని తెలిపారు.అయితే ఆ సంఘటనను రాజకీయంగా ఉపయోగించుకుని కాంగ్రెస్ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి తమపై అక్రమ కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. కోర్టుల చుట్టూ తిప్పే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, చివరకు న్యాయమే గెలుస్తుందని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్లు మహిపాల్, అబ్దుల్లా, శ్రీనివాస్, గోవింద్ రాథోడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **జూలై 20న జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 16:**




భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొరిగె సోములు.భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన భువనగిరి కలెక్టరేట్ కార్యాలయం ముందు నిర్వహించే మహా ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయు) యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగె సోములు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విరమించి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.జి.ఓ. నెం. 12ను వెంటనే రద్దు చేయాలి.సీ.ఎస్.సి. హెల్త్ సెంటర్ విధానాన్ని రద్దు చేయాలి.పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిములను వెంటనే పరిష్కరించి చెల్లించాలి.సహజ మరణం, ప్రమాద మరణం బీమా పరిహారాన్ని సంక్షేమ బోర్డు ద్వారానే చెల్లించాలి. కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. ఈ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న మహా ధర్నాలో జిల్లా నలుమూలల నుంచి భవన నిర్మాణ కార్మికులు, నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గొరిగె సోములు కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బుడ్డ ప్రసాద్, వంగాల మారయ్య, సీఐటీయు జిల్లా కమిటీ సభ్యుడు అప్పం సురేందర్, నాయకులు గోల్లూరి నాగరాజు, గొరిగె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ జడ్పీటీసీ అరవింద్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

- **ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు....**
- **6వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి నివాళి...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 16:**



సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ జడ్పీటీసీ అరవింద్ రెడ్డి 6వ వర్ధంతిని పురస్కరించుకుని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అరవింద్ రెడ్డి సమాజ అభ్యున్నతి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఖలీమ్, మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రవికిరణ్, గోవర్ధన్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సంపత్, సందీప్, అస్లాం, వజిత్, రవికుమార్, చాంద్, విజయ్, అఖిల్, ప్రకాష్, ప్రశాంత్, యాదన్న, అసాద్, నరసింహులు, గంగన్న, విజయ్ కుమార్, మొయిస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# 2 లక్షల ఎల్.ఓ.సి అందజేసిన బీజేపీ నేతలు కుంట తిరుపతి, కడార్ల రతన్...

**కరీంనగర్ వెలుతురు జూలై 16:**

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎలగందుల గ్రామానికి చెందిన తడెం రాజయ్య ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం స్పందించింది.తడెం రాజయ్య ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఆయనకు అవసరమైన 'లామినెక్టమీ ప్లస్ ఎక్సిషన్' చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి రూ. 2,00,000 (రెండు లక్షల రూపాయలు) మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ఎల్.ఓ.సి జారీ చేసింది. ఈ మేరకు గురువారం రోజున ఈ మంజూరు పత్రాలను కొత్తపల్లి మండలం బీజేపీ అధ్యక్షుడు కుంట తిరుపతి, మాజీ అధ్యక్షుడు కదర్ల రతన్ లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోనాల నరేష్, నార్ల రాములు తదితరులు బాధితునికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



# కే కే కమిటీకి రేపు ఉద్యమకారులు హాజరు కావాలి..



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 16:**

ఉద్యమ కారుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కే కే కమిటీకి రేపు అనగా ది. 17. 07. 26 న హైదరాబాద్ లో ఉమ్మడి నల్లగొండ జిల్లా లోని ఉద్యమ కారులు హాజరు కావాలని ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ చాంద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న, జిల్లా నాయకులు బొద్దుపల్లి లింగయ్య నోముల శంకర్ లు కోరారు.రేపు హైదరాబాద్ లో సెక్రటేరియట్ ముందు గల అమర జ్యోతి భవనంలో ఉమ్మడి వరంగల్ ,కమ్మం ,నల్లగొండ జిల్లాలకు సంబంధించిన ఉద్యమ కారులతో కే కే కమిటీ బృందం సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. కమిటీకి మనసలహాలు ,సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. మన ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

# మహిళలు ఆషాడంలో ఆనందంగా జరుపుకునే గోరింటాకు పండుగ అందం... ఆరోగ్యం... అతివలకు



డాక్టర్ సాయి సింధు

**శంకర్‌పల్లి జూలై 16 (వెలుతురు న్యూస్):**

గోరింటా పూసింది కొమ్మ లేకుండా మురిపాల అరచేత మొగ్గ తొడిగింది అన్నాడు ఓ సిని కవి. కృత్రిమ ఎరుపు కంటే ఆరోగ్యం ఇచ్చే గోరింట మిన్న ఆషాడం వచ్చింది అంటే చాలు గోరింటాకు ప్రతి ఒక్క మహిళలకు గుర్తొస్తుంది. ఆషాడ మాసం ముగిసే లోపు ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకోవాలని పూర్వీకులు చెబుతారు. అందుకే ఆషాడం అంటే గోరింటాకు పండుగ అంటారు. గోరింటాకు చేతులకు పెట్టుకొని యువతులు ఎంతో మురిచిపోతూ ఉంటారు. శుభకార్యాలు పండుగలు ఆషాడ మాసంలోనే, ఔషధణాలు గోరింటాకులో ఎక్కువగా ఉంటాయి. ఇటీవల కాలంలో మహిళలందరూ ఒకేచోట చేరి మెహందీ పడుగ గాను చేసుకోవడం. కిట్టి పార్టీలో కూడా ఆషాడ మొహింది పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు ఒకచోట గోరింటాకు పెట్టుకునేటప్పుడు మహిళలు ఎంతో సందడిగా ఉత్సాహంతో ఉంటారు. చర్మవ్యాధులు రాకుండా వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకుంటే చర్మవ్యాధులు రాకుండా రక్షించుకోవచ్చు అనేది ఎప్పటి నుంచో వస్తున్న మన సంప్రదాయం ఆరోగ్య రహస్యం, ఆషాడ మాసంలో వర్షాలు ఎక్కువగా కురవడంతో పొలాలు బురదగా మరి క్రిమికీటకాలు వస్తుంటవి. మహిళల పొలాల్లో వరినాట్లు వేయడం వలన చేతులు కాళ్ళకు బురద అంటుకుంటుంది. ఈ ఆషాడ మాసంలో మైదాకు పెట్టుకుంటే చర్మ వ్యాధులు రాకుండా కాపాడుతాయని వైద్యులు పలువురు చెబుతున్నారు.

### ఆషాడ మాసం యొక్క ప్రత్యేకత*

ఆషాడ మాసంలో ఏదో ఒక రోజు గోరింటాకు పెట్టుకోవాల నేది మన పూర్వీకులు చెప్పిన సంప్రదాయం. ఆనాటి నుండి సాంప్రదాయాలు అదేవిధంగా నేటి వరకు కొనసాగుతున్నాయి. గోళ్ళకు రంగును ఇచ్చే గోరింటాకు సఖరంజని అనే పేరు కూడా ఉంది. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేటి ఆధునిక కాలంలో గోరింటాకు పేరుతో రకరకాల కోన్లూ పేస్టులు మహిళలకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఆ కోన్లు పేస్టులు రంగును అందాన్ని ఇస్తాయి తప్ప వాటిలో ఎలాంటి ఔషధ గుణాలు ఉండవు.

### గోరింటాకు ప్రయోజనాలు

మైదాకు వేళ్లకు పెట్టుకోవడం, గోళ్ళు పెలుసు బారిపోకుండా కాపాడుతుంది. ఆకులే కాకుండా పూలు, వేర్లు, బెరడు విత్తనాలు కూడా ఔషధ యుక్తాలే. వీటితో శరీరంలోని ఎలర్జీను దూరం చేసుకోవచ్చు. బోధకాలు వ్యాధి ఎలాంటి దరిచేరదు. నెలకు ఒకసారి గోరింటాకు ముద్దను తలకు ప్యాక్ చేసుకుంటే జుట్టు బలపడి రాలదుంటాకు ఉంటుంది. గోరింటాకు పొడి కాచిన నూనె వాడడం చిట్కా వైద్యంలో ఒకటి. గోరింటాకు ముఖ్యంగా ఒంట్లో వేడిని తగ్గిస్తుంది.

### గోరింటాకు తయారు చేసే విధానం

మైదాకులో చింతపండు వేసి మధ్యలో కొద్దిగా మజ్జిగా వేసి రోట్లో రుబ్బాలి. మిక్సీలోన నాణ్యమైన గోరింటాకు ఇత్తలూ ఆకులు పొడిని వేడి నీళ్ళలో కలిపి రాత్రంతా నానబెడితే మంచి రంగులోకి మారుతుంది. మెహందీకు కాపా పొడిని కలిపి రాత్రంతా నానబెట్టాలి. తర్వాత రోజు పెట్టుకోవాలి దీంతో కాపీ బ్రౌన్ కలర్లో పండుతుంది. నెంబర్ వసంతంలో పంచదార తయారు చేసుకోవాలి. పెన్నాకు కాపీ పొడిని కలిపి రాత్రంతా నానబెట్టాలి తర్వాత రోజు పెట్టుకోవాలి

సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక: డాక్టర్ సాయి సింధు

ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం అనేది సంస్కృతి సాంప్రదాయంగా వచ్చే ఆనవాయితీ, వర్షాకాలం వస్తే ఆరోగ్య బారిన పడకుండా గోరింటాకు శరీరానికి వెచ్చద నాన్ని ఇస్తుంది. ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడుతుందని సాన్స్ స్కిన్ హాస్పిటల్ డాక్టర్ సాయి సింధు తెలిపారు.

### అనాదిగా వస్తున్న ఆచారం: ప్రిన్సిపాల్ శోభారాణి


(ప్రిన్సిపాల్) శోభారాణి

గోరింటాకులో "మంచి ఔషధ గుణాలు ఉన్నాయి. గోరింటాకు పెట్టుకోవడం అనేది అనాదిగా వస్తున్న ఆచారం. సాంప్రదాయమే కాకుండా వాతావరణంలో వచ్చే మార్పుల వలన శరీరంలో వచ్చే మార్పులను తొలగించే మంచి ఔషధం గోరింటాకు ఉంది. అందుకే ఆషాడంలో తప్పకుండా గోరింటాకు పెట్టుకుంటాం అని టీఎస్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు.

### చిన్ననాటి నుండి వస్తున్న ఆచారం: రాజశ్రీ


రాజశ్రీ( ఆర్ఆర్ మేకోవర్ యజమాని)

ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం అనేది చిన్ననాటి నుండి ఒక ఆనవాయితీ చిన్నతనం నుండి గోరింటాకు పెట్టుకుంటున్నాను. గోరింటాకును పోసి రోట్లో వేచి దంచి పాడపాడుతూ ఒకే చోటకు చేరి గోరింటాకును పెట్టుకునే వాళ్ళం అని ఆర్ఆర్ ప్రొఫెషనల్ మేకప్ స్టూడియో యజమానురాలు రాజశ్రీ తెలిపారు.

### గాజులు ఇచ్చి పుచ్చుకుంటాం: రాజేశ్వరి


రాజేశ్వరి (గృహిణి)

ఆషాడం వచ్చింది అంటే గాజులు ఇచ్చిపుచ్చు కుంటాం. ఆషాడం వచ్చిందంటే ముందుగా గుర్తిచ్చేది గోరింటాకు. అందరం ఒకేచోట చేరి గోరింటాకు పెట్టుకోవడంతో గాజులు ఇచ్చిపుచ్చుకుంటాం. అమ్మవారికి పూజలు నిర్వహించి గోరింటాకు పెట్టుకోవడం ఎంతో ఆనందంగా ఉంటుందని గృహిణి రాజేశ్వరి తెలిపారు.


డాక్టర్ చైతన్య

### సంప్రదాయం... ఔషధం: డాక్టర్ చైతన్య

మైదాకు చేతులకు పెట్టుకోవడం సంప్రదాయంతో పాటు మంచి ఔషధం. ఇది పూర్వం నుంచి వస్తున్న ఆచారం. నేడు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కోన్లు వచ్చాయి. కోన్లను వాడాల్సి వస్తుంది. మంచి కంపెనీలకు చెందిన గోరింటాకు కోన్లలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. శుభకార్యాలకు మహిళలు తప్పక మైదాకు పెట్టుకుంటున్నారని మెగా హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ చైతన్య అన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల నమోదు ఫారాలను వెంటనే సమర్పించండి: అసదుద్దీన్ ఒవైసీ పిలుపు

**హైదరాబాద్, జూలై 16 (వెలుతురు న్యూస్):**

తెలంగాణలోని ఓటర్లంతా తమ 'ప్రత్యేక ముమ్మర సవరణ' ఎన్యూమరేషన్ ఫారాలను గడువు కంటే ముందే సమర్పించాలని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం గడువు పొడిగించినందున ఓటర్లు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. నిజమైన ఓటర్లు ఎవరూ ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయనే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేస్తే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్ గడువును ఎన్నికల సంఘం పొడిగించిన సంగతి తెలిసిందే. బూత్ స్థాయి అధికారుల ద్వారా జరిగే ఇంటింటి వెరిఫికేషన్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించారు. ఆ తర్వాత ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా విడుదల కానుంది. దీనిపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను ఆగస్టు 10 నుండి సెప్టెంబర్ 9 వరకు స్వీకరిస్తారు. చివరకు అక్టోబర్ 12న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు.



గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. "ఎన్నికల సంఘం బీఎల్ఓ ఫారాల సమర్పణకు గడువును పొడిగించింది. అయితే ఓటర్లు ఆగస్టు 3 వరకు ఆగకుండా.. జూలై 30 లోపునే తమ ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందజేయాలి. ఎందుకంటే ప్రతి బీఎల్ఓ కనీసం 1,000 నుండి 1,100 ఫారాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. చివరి నిమిషం వరకు ఆగితే లోడ్ ఎక్కువై ఇబ్బందులు ఎదురవుతాయి" అని పేర్కొన్నారు.

2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ అయిన ఓటర్లు, తమ తల్లిదండ్రులు లేదా తాతల పేర్లు ఉన్నవారు ఎలాంటి ఆలస్యం లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సహాయక పత్రాలు ఉన్నవారు వాటిని జత చేయాలని, ఒకవేళ ఎలాంటి పత్రాలు లేకపోయినా ఆందోళన చెందకుండా కనీసం తమ సంతకం, ఫోన్ నంబర్, ప్రాథమిక వివరాలతో కూడిన ఫారాలను అందజేయాలని కోరారు. ఫారాలు సమర్పించకపోతే ముసాయిదా జాబితాలో పేర్లు రాకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఓటరు జాబితాలో తప్పుల గురించి ఒవైసీ మాట్లాడుతూ.. స్వయంగా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, తన పేరు కూడా తప్పు జాబితాలో వచ్చే అవకాశం ఉందని అన్నారని గుర్తు చేశారు. కాబట్టి ఓటర్లు భయపడాల్సిన అవసరం లేదని, నోటీసులు వస్తే తగిన ఆధారాలతో క్లారిఫై చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్లకు కావలసిన న్యాయ సహాయం అందించేందుకు ఎంఐఎం పార్టీ తరపున లీగల్ సెల్ ద్వారా దాదాపు 220 మంది లాయర్లను రంగంలోకి దించుతున్నట్లు ప్రకటించారు. ఓటర్ల మ్యాపింగ్ తనిఖీ కోసం ఒక ప్రత్యేక అప్లికేషన్‌ను కూడా అభివృద్ధి చేశామని, రాష్ట్రవ్యాప్తంగా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అక్టోబర్ 12న విడుదలయ్యే తుది జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఉండేలా చూడటమే తమ లక్ష్యమని ఒవైసీ స్పష్టం చేశారు.

# రూ. 60 వేల లంచం.. ఏసీబీకి చిక్కిన ఆదిలాబాద్ ఇరిగేషన్ అధికారులు!

**ఆదిలాబాద్, జూలై 16 (వెలుతురు న్యూస్):**

నీటిపారుదల శాఖలో అవినీతి తిమింగలాల ఆట కట్టించేందుకు అవినీతి నిరోధక శాఖ రంగంలోకి దిగింది. ఆదిలాబాద్ జిల్లాలో గురువారం జరిపిన మెరుపు దాడిలో ఒక పోల్ట్రీ ఫామ్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన ఇద్దరు నీటిపారుదల శాఖ అధికారులను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ విఠల్, అసిస్టెంట్ ఇంజనీర్ రూపవతి రమేష్ ఈ దాడిలో అడ్డంగా దొరికి పోయారు.సోనాల్ గ్రామంలోని వ్యవసాయ భూమి పక్కనే ఒక చిన్న నీటిపారుదల కాలువ ప్రవహిస్తుండటంతో, అక్కడ పోల్ట్రీ ఫామ్ నిర్మించేందుకు యజమాని ఇరిగేషన్ శాఖ ఎన్ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే దీనిని జారీ చేయడానికి ఈఈ విఠల్ మొదట లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.60 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది.

ఈఈ ఆదేశాల మేరకు ఏఈ రమేష్ మధ్యవర్తిగా వ్యవహరించి బాధితుడి నుంచి రూ.60 వేలు లంచం సొమ్మును తీసుకుంటుండగా ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులు దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. రసాయన పరీక్షలు నిర్వహించి లంచం సొమ్మును రికవరీ చేశారు. తమ అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడిన ఈ ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టుకు తరలించినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి.

# ఎల్‌నినో సవాళ్లను కలిసికట్టుగా...

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు ఉపయోగపడే ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి ఈ ప్రణాళికలో పొందుపరిచామని చెప్పారు.ఈ కంటింజెన్సీ ప్లాన్‌ను జిల్లా కలెక్టర్లు అత్యంత పకడ్బందీగా అమలు చేయాలని, అలాగే గ్రామస్థాయి వరకు విస్తృతంగా తీసుకెళ్లి ప్రతి రైతుకు సవివరంగా అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు సరైన సమయంలో సరైన సలహాలు అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.రాష్ట్రాన్ని భౌగోళిక, వాతావరణ, నేలల స్వభావం ఆధారంగా మూడు వ్యవసాయ ప్రాంతాలుగా విభజించి, ఆయా ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా ఈ కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించామని మంత్రి వివరించారు. ప్రతి జిల్లా, ప్రతి మండలానికి సంబంధించిన వర్షపాతం పరిస్థితులు, రానున్న రెండు నుంచి మూడు వారాల వాతావరణ అంచనాలు, భారత వాతావరణ శాఖ (IMD) వారపు సూచనలను ఇందులో పొందుపరిచినట్లు తెలిపారు.రైతులు ఏ పంటను ఏ సమయంలో విత్తడం అనుకూలమో తెలియజేసే విధంగా 18 ప్రధాన పంటలకు సంబంధించిన శాస్త్రీయ మార్గదర్శకాలు ఇందులో ఉన్నాయని చెప్పారు. భూమి స్వభావాన్ని బట్టి ప్రస్తుతం ఇంకా ఏ పంటలను సాగు చేయవచ్చో, ప్రత్యామ్నాయంగా ఏ పంటలు అనుకూలమో కూడా స్పష్టంగా సూచించినట్లు తెలిపారు.అదేవిధంగా ప్రతి జిల్లాలోని భూగర్భ జలాల లభ్యత, ప్రధాన, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, ఇంకా సాగుకు అందుబాటులో ఉన్న నీటి పరిస్థితులపై సమగ్ర సమాచారం కూడా ఈ ప్రణాళికలో పొందుపరిచినట్లు మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టుల వారీగా నీటి లభ్యతకు సంబంధించిన వివరాలను రైతులకు రోజువారీగా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు.ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి ఆధారంగా జిల్లా కలెక్టర్లు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తక్షణ నిర్ణయాలు తీసుకునేలా సాగునీటి శాఖ కార్యదర్శితో చర్చించాలని వ్యవసాయ శాఖ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం నెలకొన్న పొడి వాతావరణ పరిస్థితులు మరికొంత కాలం కొనసాగవచ్చని అంచనాలు ఉన్నందున ఇప్పటికే సాగులో ఉన్న పంటలను ఎలా సంరక్షించుకోవాలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కంటింజెన్సీ ప్లాన్‌లో పంటల వారీగా నిర్వహణ చర్యలు, ఇప్పటికే సాగైన విస్తీర్ణం, ఇంకా సాగు చేసే అవకాశాలు, ప్రత్యామ్నాయ పంటలు, ఆయా పంటలకు అవసరమైన విత్తనాల లభ్యత వంటి అన్ని అంశాలను సమగ్రంగా పొందుపరిచినట్లు తెలిపారు.అల్పపీడనాలు ఏర్పడుతున్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని భావించే పరిస్థితి లేదని భారత వాతావరణ శాఖ (IMD) అధికారులు మంత్రికి తెలిపారు. భూపాలపల్లి, నారాయణపేట జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే 2 నుంచి 3 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో 2 నుంచి 3 మిల్లీమీటర్ల స్వల్ప వర్షపాతం మాత్రమే నమోదయ్యే అవకాశముందని పేర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడుకునే చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా బోర్ వేల్స్ పై ఆధారపడి వరి సాగు చేయడం ప్రస్తుతం అనుకూలం కాదని, అలాంటి పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటలు, కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులు రానున్న నెలల్లో కూడా కొనసాగితే ఇప్పటికే సాగుచేసిన పంటలు మరియు ఉద్యానపంటల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక ప్రకారం అధికారులు ముందుకు సాగాలని మంత్రి సూచించారు. రైతులకు అవసరమైన ప్రతి సూచన, సలహా సమయానుకూలంగా అందేలా వ్యవసాయ యంత్రాంగం గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని చెప్పారు. ప్రస్తుతం రైతుల్లో కూడా వర్షాలపై ఆశలు తగ్గుతున్న నేపథ్యంలో, ప్రత్యామ్నాయ పంటలపై నిర్ణయం తీసుకునేందుకు ఇదే సరైన సమయమని మంత్రి పేర్కొన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ శ్రీ బి. గోపి, సహకార శాఖ కమిషనర్ శ్రీ రాహుల్ రాజ్, ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీమతి యాస్మిన్ బాషా, తెలంగాణ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ శ్రీమతి లక్ష్మి, హాకా ఎండీ శ్రీ చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి మరియు ICRISAT, IIMR, IIOR, CRIDA, IMD ప్రతినిధులు పాల్గొన్నారు.



# సామాన్యుడికీ విమాన ప్రయాణం

- మరో పదేళ్లు 'ఉడాన్' స్కీమ్ పొడిగింపు
- వంద కొత్త విమానాశ్రయాలే లక్ష్యం
- మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటన
- ప్రాంతీయ విమాన అనుసంధానానికి సరికొత్త ఊతం
- ఢిల్లీ ఉన్నత స్థాయి వర్క్‌షాప్‌లో వెల్లడి
- శరవేగంగా విస్తరిస్తున్న దేశీయ ఎయిర్‌పోర్టుల నెట్‌వర్క్
- రాబోయే పదేళ్లలో 100 సరికొత్త విమానాశ్రయాల నిర్మాణం
- విమానయాన రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

**న్యూఢిల్లీ, వెలుతురు జూలై 15: జూలై 16:**

దేశంలోని సాధారణ పౌరులకు, మధ్యతరగతి ప్రజలకు సైతం విమాన ప్రయాణాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే ఉన్నత లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రాంతీయ అనుసంధాన పథకం 'ఉడాన్' కు సరికొత్త ఊతం లభించింది. ఈ అద్భుతమైన స్కీమ్‌ను మరో 10 సంవత్సరాల పాటు పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. దీనివల్ల దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా విమాన సర్వీసులు విస్తరించడానికి, సామాన్యుడి కలలు సాకారం కావడానికి మార్గం సుగమం అయింది.

ఈ పథకం యొక్క తదుపరి దశ కార్యాచరణ, భవిష్యత్ ప్రణాళికల అమలుపై దేశ రాజధాని న్యూఢిల్లీలో ఒక ఉన్నత స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కీలక సమావేశంలో



కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో విమానయాన రంగం గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆయన కొనియాడారు. దేశీయ ఎయిర్‌పోర్టుల నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేయడానికి తమ శాఖ అహర్నిశలు శ్రమిస్తోందని వివరించారు.

భవిష్యత్తుకు సంబంధించిన పారిశ్రామిక, రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఒక భారీ లక్ష్యాన్ని ప్రకటించారు. రాబోయే 10 సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా కొత్తగా మరో 100 విమానాశ్రయాలను (ఎయిర్‌పోర్టులు) నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించిందని వెల్లడించారు. ఈ వంద కొత్త విమానాశ్రయాల నిర్మాణం పూర్తి కావడం వల్ల దేశంలోని రవాణా రంగ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, ఇది విమానయాన రంగంలో ఒక విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల వేగాన్ని మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా వివరిస్తూ.. తాము నిర్దేశించుకున్న ప్రణాళికల ప్రకారం దేశంలో ప్రస్తుతం ప్రతి నెలా ఒక కొత్త విమాన ఆశ్రయాన్ని కానీ, లేదా అత్యాధునిక సదుపాయాలతో కూడిన కొత్త టెర్మినల్‌ను కానీ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. ఈ వేగవంతమైన వృద్ధి వల్ల గగనతల ప్రయాణ సేవలు ఇకపై కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, ప్రతి సామాన్య పౌరుడి చెంతకు వేగంగా చేరువవుతున్నాయని స్పష్టం చేశారు.

కొత్త విమానాశ్రయాల నిర్మాణం మరియు పాత రన్‌వేల ఆధునికీకరణ పనులను నిర్దేశిత కాలపరిమితిలోనే పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే కేంద్రపాలిత ప్రాంతాల యంత్రాంగాలు 100 శాతం భాగస్వామ్యంతో కేంద్రానికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నాయని వివరించారు. అందరి ఉమ్మడి కృషితోనే ఈ మౌలిక వసతుల కల్పన శరవేగంగా సాధ్యమవుతోందని హర్షం వ్యక్తం చేశారు.

దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు (చిన్న పట్టణాలకు) విమాన సర్వీసులను మరింత పెద్ద ఎత్తున పెంచడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం నిబంధనలలో కొన్ని కీలక సడలింపులు చేసింది. ఇప్పటివరకు పెద్దగా విమాన రాకపోకలు లేని చిన్న నగరాల ప్రజలకు తక్కువ ధరలోనే విమాన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడానికి వీలుగా ప్రస్తుత 'ఉడాన్' పథకం మార్గదర్శకాలను మరింత సరళతరం చేస్తూ మార్పులు చేశామని మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

## ఉమ్మడి నిజామాబాద్ అభివృద్ధికి మరో అడుగు..

- పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చొరవతో కీలక ప్రాజెక్టులకు నిధులు
- తిలక్ గార్డెన్‌లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతులకు రూ.50 లక్షలు
- లింబాద్రి గుట్ట టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.4 కోట్లు
- ఆర్మూర్ సిద్ధుల గుట్ట గెస్ట్ హౌస్‌కు రూ.50 లక్షల మంజూరు

**నిజామాబాద్, వెలుతురు జులై 16:**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మరో కీలక ముందడుగు వేశారని జిల్లా కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడంలో ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపింది.నిజామాబాద్ నగరంలోని తిలక్ గార్డెన్‌లో ఉన్న రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతులు, ఆధునికీకరణ కోసం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించింది. ఈ నిధులతో ఆడిటోరియాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు మరింత అనువుగా తీర్చిదిద్దనున్నట్లు



పేర్కొంది.బాల్కొండ నియోజకవర్గంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం లింబాద్రి గుట్ట వద్ద టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.4 కోట్లను మంజూరు చేయించినట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల అభివృద్ధికి ఊతమివ్వనుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొంది.అలాగే ఆర్మూర్‌లోని సిద్ధుల గుట్ట వద్ద టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపింది.ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు.

# హర్మూజ్ జలసంధిలో యుద్ధం మంట

- భారతీయ నావికులకు కేంద్రం నో ఎంట్రీ
- నౌకాయాన సంస్థలకు డీజీఎంఏ కీలక ఆదేశాలు
- భారత నావికుల రక్షణే పరమావధి
- హర్మూజ్ నౌకలపై కేంద్ర ప్రభుత్వం నిషేధం
- తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిబంధనలు
- షిప్పింగ్ కంపెనీలు, ఏజెన్సీలకు హెచ్చరిక
- యుద్ధంతో దెబ్బతింటున్న గల్ఫ్ భద్రత
- అంతర్జాతీయ జలాల్లో వేగంగా మారుతున్న సమీకరణాలు

**న్యూఢిల్లీ, వెలుతురు జులై 16:**

అంతర్జాతీయ జలాల్లో అమెరికా మరియు ఇరాన్ దేశాల మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతుండటంతో భారత ప్రభుత్వం అత్యంత అప్రమత్తమైంది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించే ఎలాంటి వాణిజ్య నౌకల్లోనూ భారతీయ నావికులను (కార్గో సిబ్బందిని) నియమించకూడదని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మన దేశానికి చెందిన నావికుల ప్రాణ రక్షణే పరమావధిగా భావించి, కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎంఏ) ఈ మేరకు అత్యవసర ఉత్తర్వులను జారీ చేసింది.సముద్రయాన నియంత్రణ సంస్థ (డీజీఎంఏ) విడుదల చేసిన ఈ తాజా ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. తదుపరి అధికారిక ఆదేశాలు వచ్చేంతవరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న నౌకల యజమానులు, షిప్పింగ్ కంపెనీల నిర్వాహకులు, అలాగే నావికులను రిక్రూట్ చేసే రిక్రూట్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్స్ సంస్థలు ఈ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. హర్మూజ్ జలసంధి మార్గంలో వెళ్లే ఏ నౌకలోనూ భారతీయులను చేర్చుకోకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.గల్ఫ్ ప్రాంతంలో రోజురోజుకూ భద్రతా పరిస్థితులు దారుణంగా దిగజారిపోతున్నాయని డీజీఎంఏ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య నడుస్తున్న సుదీర్ఘ పోరాటం కారణంగా పర్షియన్ గల్ఫ్ మరియు హర్మూజ్ జలసంధి ప్రాంతాలు యుద్ధ క్షేత్రాలుగా మారాయి. ఈ అంతర్జాతీయ జలాల్లో భద్రతా సమీకరణాలు వేగంగా మారిపోతుండటం వల్ల, అక్కడ ప్రయాణించే సాధారణ వాణిజ్య నౌకలకు కూడా ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ విపత్కర పరిస్థితుల వల్లే భారత ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.అమెరికా–ఇరాన్ యుద్ధ తీవ్రత కారణంగా ఘర్షణ ప్రాంతంగా మారిన హర్మూజ్ జలసంధిలో ఇటీవల అనేక వాణిజ్య సరుకు రవాణా నౌకలు దాడులకు గురవుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కి చెందిన వాణిజ్య నౌకలపై ఇరాన్ సైన్యం జరిపిన మెరుపు దాడులు పెద్ద కలకలం రేపాయి. దురదృష్టవశాత్తూ ఈ దాడుల్లో నౌకలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు భారతీయ నావికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మన దేశానికి చెందిన ఇద్దరు పౌరులు మృతి చెందడంతో భారత కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ నిషేధాజ్ఞలు విధించింది.భారతీయ నావికుల భద్రత, సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా డీజీఎంఏ గల్ఫ్ జలాల్లో హై అలర్ట్ ప్రకటించింది. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధితో పాటు దానికి ఆనుకుని ఉన్న పరిసర ప్రాంతాల జలాల్లో రాకపోకలపై గట్టి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించింది. సముద్ర మార్గంలో వచ్చే అంతర్జాతీయ నావిగేషనల్ హెచ్చరికలను, వివిధ దేశాల రక్షణ సంస్థలు ఇచ్చే భద్రతా సలహాలను 24 గంటలూ నిరంతరం పర్యవేక్షిస్తూ, అప్రమత్తంగా ఉండాలని నౌకాయాన అధికారులకు సూచించింది.ఈ అత్యవసర పరిస్థితుల్లో అంతర్జాతీయ నౌకలు మరియు ఓడరేవుల భద్రతా నిబంధనల కోడ్‌ను అత్యంత కఠినంగా అమలు చేయాలని డీజీఎంఏ ఆదేశించింది. గల్ఫ్ జలాల గుండా ప్రయాణించే ఇతర భారతీయ సంబంధిత నౌకలు తమ భద్రతా రక్షణ వలయాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని స్పష్టం చేసింది. దాడుల ముప్పు ఎక్కువగా ఉన్నందున, నౌకల్లో ఉండే రక్షణ సిబ్బంది మరియు సాంకేతిక పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని యాజమాన్యాలకు మార్గదర్శకాలు జారీ చేసింది.ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అంతర్జాతీయ వాణిజ్యానికి పెద్ద ముప్పు ఏర్పడింది. యుద్ధంలో నేరుగా సంబంధం లేని వివిధ దేశాల సరుకు



రవాణా నౌకలే లక్ష్యంగా ఇరాన్, అమెరికా బలగాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. డ్రోన్లు, క్షిపణులతో జరుగుతున్న ఈ దాడుల వల్ల సముద్ర మార్గంలో భయానక వాతావరణం నెలకొంది. చమురు రవాణా చేసే ట్యాంకర్లు, కంటైనర్ నౌకలు ఈ రూట్‌లో ప్రయాణించాలంటేనే వణికిపోతున్నాయి. ఇలాంటి ప్రమాదకర జోన్‌లోకి మన దేశ పౌరులు వెళ్లకుండా చూడటమే ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.సముద్రాలపై ఉద్యోగాలు చేస్తూ గల్ఫ్ దేశాల వైపు వెళ్లిన వేలాది మంది భారతీయ నావికుల కుటుంబాల్లో ఈ యుద్ధ వార్తలు తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి. తమ వారు ఎప్పుడు సురక్షితంగా ఇంటికి వస్తారో తెలియక కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ.. విదేశీ జలాల్లో ఉన్న ప్రతి ఒక్క భారతీయ నావికుడి సంక్షేమానికి, రక్షణకు తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చింది. పరిస్థితులు మళ్లీ సాధారణ స్థితికి వచ్చే వరకు నావికులు ఎవరూ హర్మూజ్ జలసంధి వైపు వెళ్లే నౌకల్లో ప్రయాణించవద్దని, ప్రభుత్వ నిబంధనలకు సహకరించాలని కోరింది.

# 9వ తరగతిలో కొత్త భాషను బోధించడం సరికాదు..

- 5 లేదా 6వ తరగతిలోనే ప్రవేశపెట్టాలి: సుప్రీంకోర్టు
- సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై కీలక వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం
- 9వ తరగతిలో కొత్త భాష ప్రవేశపెడితే విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని అభిప్రాయం
- కొత్త భాషను 5 లేదా 6వ తరగతి నుంచే బోధించాలని ప్రభుత్వానికి సూచన
- తమిళనాడులో జేఎన్‌వీ ఏర్పాటుకు సంబంధించిన పిటిషన్ విచారణలో వ్యాఖ్యలు
- త్రిభాషా విధానంపై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విడిగా విచారణ జరుపుతోందని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, వెలుతురు జూలై 15: జూలై 16:**

సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికలో అమలవుతున్న త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. విద్యార్థులకు కొత్త భాషను తొమ్మిదో తరగతిలో ప్రవేశపెట్టడం సరైన విధానం కాదని, ఆ దశలో కొత్త భాషను నేర్చుకోవాల్సి రావడం వల్ల వారిపై అదనపు విద్యా భారం పడుతుందని అభిప్రాయపడింది. దీనికి బదులుగా కొత్త భాషను ఐదో లేదా ఆరో తరగతి నుంచే బోధించడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల (జేఎన్‌వీ) ఏర్పాటుకు సంబంధించిన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. విద్యార్థులు చిన్న వయస్సులోనే కొత్త భాషను సులభంగా నేర్చుకునే అవకాశం ఉంటుందని, ఉన్నత తరగతుల్లో అకస్మాత్తుగా కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని ధర్మాసనం పేర్కొంది.దేశవ్యాప్తంగా జవహర్



నవోదయ విద్యాలయాల్లో త్రిభాషా విధానం అమలులో ఉంది. అయితే తమిళనాడు ప్రభుత్వం రెండుభాషల విధానాన్నే అనుసరిస్తూ త్రిభాషా విధానాన్ని వ్యతిరేకిస్తోంది. ఈ కారణంగానే రాష్ట్రంలో జేఎన్‌వీల ఏర్పాటుకు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.ఈ నేపథ్యంలో తమిళనాడులో ప్రతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని మద్రాస్ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా విద్యార్థులపై భాషల బోధన ప్రభావంపై ధర్మాసనం తన అభిప్రాయాన్ని వెల్లడించింది.అయితే, సీబీఎస్ఈలో త్రిభాషా విధానం అమలు, దాని చట్టబద్ధతకు సంబంధించిన ప్రధాన అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఇప్పటికే విడిగా విచారణ జరుపుతోందని కోర్టు స్పష్టం చేసింది. అందువల్ల ఈ వ్యాఖ్యలు ప్రస్తుత విచారణ సందర్భంగా చేసిన పరిశీలన మాత్రమేనని, త్రిభాషా విధానంపై తుది నిర్ణయం ప్రత్యేక ధర్మాసనం విచారణ అనంతరం వెలువడే అవకాశం ఉంది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు కాదు మొదటగా వారికి ఇవ్వవలసిన ఫీజు బకాయిలు ఇవ్వండి

- నేడు (జూలై 17న) జరగబోయే క్యాబినెట్లు బీసీ,ఎస్సీ మంత్రులు ముఖ్యమంత్రిని నిలదీయాలి.
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ సలహా

**హైదరాబాద్ వెలుతురు జూలై 16:**

పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేతకాదు గాని విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు ఇస్తాననడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు.14 లక్షల మంది విద్యార్థులు ఫీజులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రేపు జరగబోయే (జూలై 17న) క్యాబినెట్లో బీసీ,ఎస్సీ మంత్రులు దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రినీ నిలదీయాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి మాటలకు చేతలకు పొంతన లేదన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసిన ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాగించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు రాంబాబు యాదవ్ శ్రీనివాస్



అనిత సైదులు రమేష్ కిరణ్ అశోక్ సురేష్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోల్కొండ బోనాల మహోత్సవంలో వైద్య శిబిరాలు

- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పి. శ్రీనివాస్

**గోల్కొండ, వెలుతురు జులై 16:**

గోల్కొండ బోనాల మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభం కావడంతో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పి. శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోల్కొండ క్లస్టర్ సీనియర్ అధికారి డాక్టర్ మురళీధర్ ఆధ్వర్యంలో గోల్కొండ కోట దగ్గర వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. పర్యవేక్షణలో భాగంగా తాను గోల్కొండ కోటను సందర్శించడం జరిగిందని తెలిపారు. వైద్య శిబిరాలను పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. మొత్తం ఐదు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులు ఎలాంటి అస్వస్థతకు గురైన ప్రాథమిక చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. అస్వస్థతకు గురైన భక్తులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సి. పి. ఆర్ విధానం పై




ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని వివరించారు.

# టీజీ-20 లీగ్ యువ క్రికెటర్లకు గొప్ప వేదిక



- దేశానికి మరిన్ని ప్రతిభావంతులు రావాలి: సీఎం రేవంత్ రెడ్డి
- అంతర్జాతీయ మ్యాచ్‌ల తరహాలో టీజీ-20 లీగ్‌కు విశేష ఆదరణ లభించిందన్న సీఎం
- యువ క్రికెటర్ల ఎదుగుదలకు ఈ లీగ్ ఎంతో ఉప యోగపడుతుందని వ్యాఖ్య
- హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టును అభినం దించిన రేవంత్ రెడ్డి
- విజేత జట్టు సభ్యులకు చెక్కులు అందజేసిన ముఖ్యమంత్రి
- రామోజీ గ్రూప్, ఈటీవీ సంస్థల ప్రోత్సాహాన్ని ప్రశంసించిన సీఎం

**హైదరాబాద్, వెలుతురు జులై 16:**

టీజీ-20 లీగ్ యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసే అద్భుత వేదికగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల తరహాలో ఈ లీగ్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందని పేర్కొన్నారు. ఆటపై అంకితభావం, కష్టపడే తత్వం ఉంటేనే సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాలు తయారవుతారని, యువ ఆటగాళ్లు అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.టీజీ-20 లీగ్ తొలి విజేతగా నిలిచిన 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్'ఫ్రాంచైజీ యాజమాన్యం, జట్టు సభ్యులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జట్టుకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేసి విజేతలకు చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ ఎండీ బాపినీడు, హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. టీజీ-20 లీగ్ యువ క్రికెటర్లకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి అవకాశాన్ని కల్పించిందన్నారు. ఆటపై నిబద్ధత, క్రమశిక్షణ ఉంటేనే అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. ప్రపంచ క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్ వంటి మహానుభావులు సాధించిన విజయాల వెనుక వారి అంకితభావమే ప్రధాన కారణమని పేర్కొన్నారు.యువ క్రికెటర్ల వెనుక రామోజీ గ్రూప్, ఈనాడు, ఈటీవీ వంటి సంస్థలు అండగా నిలవడం అభినందనీయమని సీఎం అన్నారు. ఈ సంస్థల సహకారం క్రికెటర్లకు "వెయ్యి ఏనుగుల బలం" లాంటిదని వ్యాఖ్యానించారు. గతంలో ఇలాంటి కార్పొరేట్ సంస్థల మద్దతు చాలా మంది క్రీడాకారులకు అందుబాటులో ఉండేదికాదని, ఇప్పుడు అలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.టీజీ-20 లీగ్ ద్వారా తెలంగాణ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే మరింత మంది క్రికెటర్లు తయారవాలని ఆకాంక్షించిన సీఎం, దేశ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా చాటే క్రీడాకారులు ఈ వేదిక ద్వారా వెలుగులోకి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని, యువ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తూనే ఉంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# టీఎంసీకి మరో షాక్.. రాజ్యసభ సభ్యత్వానికి కోయల్ మల్లిక్ రాజీనామా

- నాలుగు నెలలకే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన కోయల్ మల్లిక్
- రాజీనామా కారణాలను ఇంకా వెల్లడించని టీఎంసీ ఎంపీ
- టీఎంసీలో కొనసాగుతున్న వలసల మధ్య తాజా పరిణామం
- రాజ్యసభలో టీఎంసీ బలం 9కు తగ్గింది
- వరుస రాజీనామాలతో మమతా బెనర్జీ పార్టీకి ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ, వెలుతురు జులై 16:**



తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి మరో రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ రాజ్యసభ సభ్యురాలు, సినీ నటి-రాజకీయ నాయకురాలు కోయల్ మల్లిక్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేవలం నాలుగు నెలల క్రితమే టీఎంసీ తరపున రాజ్యసభకు ఎన్నికైన ఆమె, ఇంత తక్కువ వ్యవధిలోనే పదవికి రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సమాచారం ప్రకారం, కోయల్ మల్లిక్ రాజ్యసభ ఛైర్మన్ సీ.పీ. రాధాకృష్ణన్‌ను కలిసి తన రాజీనామా లేఖను సమర్పించారు. అయితే, ఆమె తన నిర్ణయానికి గల కారణాలను ఇప్పటివరకు బహిరంగంగా వెల్లడించలేదు. దీంతో ఆమె తదుపరి రాజకీయ అడుగుపై ఊహాగానాలు ఊపందుకున్నాయి.ఇటీవలి కాలంలో టీఎంసీలో అసంతృప్తి పెరుగుతుండగా పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారు. ఈ నేపథ్యంలో కోయల్ మల్లిక్ రాజీనామా కూడా అదే పరిణామాల్లో భాగంగా రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు. బుధవారం టీఎంసీ సీనియర్ ఎమ్మెల్యే, మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా భావించే మదన్ మిత్ర కూడా పార్టీ పదవులకు రాజీనామా చేసి రితబ్రతా బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గంలో చేరడం గమనార్హం.కోయల్ మల్లిక్ రాజీనామాతో రాజ్యసభలో టీఎంసీ బలం 9 మంది సభ్యులకు తగ్గింది. ఇటీవల ఇప్పటికే పలువురు టీఎంసీ రాజ్యసభ సభ్యులు పార్టీని వీడడంతో ఎగువ సభలో పార్టీ బలం క్రమంగా తగ్గుతోంది.కోయల్ మల్లిక్ రాజీనామాపై టీఎంసీ అధికారికంగా స్పందించలేదు. మరోవైపు, ఆమె భవిష్యత్తు రాజకీయ ప్రస్థానంపై కూడా ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఈ పరిణామం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీకి తాజా రాజకీయ ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు రంగం సిద్ధం

- కీలక బిల్లులతో కేంద్రం
- జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు
- ఐదు కొత్త బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపునకు సవరణ

**న్యూఢిల్లీ, వెలుతురు జులై 16:**



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 13 వరకు కొనసాగే ఈ సమావేశాల బిజినెస్ లిస్ట్‌ను లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల చేశారు. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఐదు కీలక కొత్త బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది.సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని దృష్టిలో ఉంచుకుని న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 33 నుంచి 37కు పెంచేలా చట్ట సవరణ బిల్లును కేంద్రం తీసుకురానుంది. అలాగే గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో కీలక మార్పులకు సంబంధించిన బిల్లును కూడా ప్రవేశపెట్టనుంది.విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (FCRA)లో సవరణలు చేసే బిల్లుపై కూడా ఈ సమావేశాల్లో చర్చించి ఆమోదం పొందేందుకు ప్రభుత్వం ప్రయత్నించనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'పై కూడా తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.జనన, మరణాల ఆలస్యపు నమోదుకు సంబంధించిన నిబంధనలను మరింత కఠినతరం చేసే సవరణ బిల్లును కూడా కేంద్రం తీసుకురానుంది. అలాగే జాతీయ గౌరవానికి భంగం కలిగించే చర్యలను నిరోధించే చట్టంలో మరికొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఎంఎస్‌ఎంఈ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరచడం, చెల్లింపుల జాప్య సమస్యలకు పరిష్కారం కల్పించడం కోసం కొత్త బిల్లును ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వాలు సొంతంగా ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ కూడా ప్రతిపాదించనుంది.అదనంగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎక్సెస్ గ్రాంట్స్ వ్యయానికి లోక్‌సభ ఆమోదం పొందేందుకు ఓటింగ్ నిర్వహించనున్నారు. రాజకీయంగా, ఆర్థికంగా కీలకమైన ఈ సమావేశాల్లో పలు బిల్లులపై విస్తృత చర్చలు జరిగే అవకాశం ఉంది.

# సైదాబాద్ స్కూల్ ఘటనపై బీజేపీ ఆగ్రహం..

- నిష్పాక్షిక దర్యాప్తు చేయాలని రాంచందర్ రావు డిమాండ్
- సక్సెస్ స్కూల్ ఘటనను తీవ్రంగా ఖండించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
- హిందూ విద్యార్థికి కల్మా హోమ్‌వర్క్ ఇవ్వడం ఆందోళనకరమని వ్యాఖ్య
- ఘటనపై పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్, వెలుతురు జులై 16:**

సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో చోటుచేసుకున్న వివాదాస్పద ఘటనపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన విడుదల చేసిన ప్రకటనలో పలు ఆరోపణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ఓ హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను హోమ్‌వర్క్‌గా ఇవ్వడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఈ ఘటన రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు సంబంధించిన తీవ్రమైన అంశంగా మారిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో "ఎడ్యుకేషన్ జిహాద్" తారాస్థాయికి చేరుకుందని ఆరోపించిన ఆయన, ఈ ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే ఇటువంటి ఘటనలకు ప్రోత్సాహం లభిస్తోందని విమర్శించారు.తమ బిడ్డకు ఇచ్చిన హోమ్‌వర్క్‌ను గమనించి పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించిన ఆ చిన్నారి తల్లిని ఆయన అభినందించారు. అయితే ఇంత తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పటికీ ప్రభుత్వం, విద్యాశాఖ ఇప్పటివరకు పాఠశాల యాజమాన్యంపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.కేవలం ఒక ఉపాధ్యాయుడిని బాధ్యతల నుంచి తప్పించడం సరిపోదని, ఈ ఘటనకు సంబంధించి పూర్తి బాధ్యత పాఠశాల యాజమాన్యానిదేనని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు లేదా మతపరమైన అంశాలను బలవంతంగా రుద్దడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. కొన్ని విద్యాసంస్థల్లో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రావొద్దని ఒత్తిడి చేస్తున్నారంటూ కూడా ఆరోపించారు.

# సైదాబాద్ స్కూల్ ఘటనపై బండి సంజయ్ ఆగ్రహం..

- స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- బలుపెక్కి బరితెగించి హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని మండిపాటు
- హిందూ విద్యార్థితో కల్మా, సూరా అల్-ఫాతిహా చదివించాలని చెప్పడం దుర్మార్గమని వ్యాఖ్య
- సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్, వెలుతురు జులై 16:**



సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో చోటుచేసుకున్న వివాదాస్పద ఘటనపై కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ విద్యార్థితో కల్మా, సూరా అల్-ఫాతిహా చదివించాలని చెప్పడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. బలుపెక్కి, బరితెగించి హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని ఆరోపించారు.ఈ ఘటనపై సోకాల్డ్ సెక్యులర్ సంఘాలు ఎందుకు నోరు మెదపడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. హిందూ సమాజమంతా ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఈ ఘటనను చూసీ చూడనట్లు వ్యవహరిస్తే తెలంగాణ అంతటా ఇలాంటి ఘటనలు విస్తరించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులపై ఏ మతాన్నీ బలవంతంగా రుద్దడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.ఇటీవల ఆటో డ్రైవర్ భరత్ వ్యవహారాన్ని ప్రస్తావించిన బండి సంజయ్..

అతడిని వేధించిన పోలీసులు, మజ్లిస్ నాయకులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భరత్ రాసిన దాంట్లో తప్పేముందని ప్రశ్నించిన ఆయన, హిందువులను కించపరిచేలా ఉర్దూలో ఆటోలు, గోడలపై రాసుకున్న వారిపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని నిలదీశారు. "వాళ్లకో న్యాయం.. భరత్‌కు ఇంకో న్యాయమా?" అని ప్రశ్నించారు.

# హైదర్‌గూడ డివిజన్‌లో విజయవంతంగా 16వ రోజుకు చేరిన 'ప్రత్యేక ఓటరు సమీక్ష' (SIR)

**హైదరాబాద్ వెలుతురు జులై 16:**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు సమీక్ష (SIR) ప్రక్రియ, హైదర్‌గూడ డివిజన్ వ్యాప్తంగా బిజెపి సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి గారి అద్భుత సారథ్యంలో గురువారం రోజుతో విజయవంతంగా 16వ రోజుకు చేరుకుంది. ఓటర్ల వివరాల నమోదు, తప్పుల సవరణే ధ్యేయంగా బీజేపీ సైనికులు నిర్విరామంగా మిస్తున్నారు.ఈ మహాయజ్ఞంలో బొక్క బాల్ రెడ్డి గారితో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలైన గోనే శ్రీకాంత్ రెడ్డి, పవన్ పల్లుచెరువు, నరేందర్, భూపాల్ ముదిరాజ్, కర్ణాకర్, రాజశేఖర్, మనోజ్, చిన్న మనోజ్, పెద్ద మనోజ్ మరియు అనేకమంది బీజేపీ కార్యకర్తలు, బీఎల్ఓలు (BLO) భాగస్వాములై విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నారు.



### ఓటర్ల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ సదుపాయం:

ఇంకా ఎవరైనా ఓటరు నమోదు లేదా సవరణ ఫారమ్‌లు తీసుకోకపోతే, నిరాశ చెందాల్సిన అవసరం లేదు.హైదర్‌గూడ డివిజన్ పరిధిలోని కాలనీ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, విల్లాస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, గేటెడ్ కమ్యూనిటీల ప్రతినిధులు ఎవరైనా సరే మా హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేస్తే... మా బీజేపీ కార్యకర్తలే స్వయంగా మీ వద్దకు వచ్చి ఫారమ్‌లను అందజేస్తారు. అంతేకాదు, మీ వద్దే ఆ ఫారమ్‌లను పూర్తి చేయించి, తిరిగి తామే స్వయంగా సేకరించి సబ్మిట్ చేస్తారు.

### ముఖ్య గమనిక:

హైదర్‌గూడ డివిజన్ పరిధిలో మీరు ఎక్కడ ఉన్నా సరే... మా హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేయండి. మేమే ఫారమ్‌లు ఇప్పిస్తాం, తీసుకుంటాం మరియు నింపి కూడా ఇస్తాం.

### ఈ తప్పులు అస్సలు చేయకండి:

ఆగస్టు 3వ తేదీ వరకు సమయం ఉంది కదా అని నిర్లక్ష్యంతో చివరి నిమిషం దాకా ఆగవద్దు, మా సేవా సైనికులు ఉప్పర్‌పల్లి బీజేపీ ఆఫీస్ నందు, వివిధ బూత్‌లలో ప్రతిరోజూ ఉదయం 9:00 నుండి రాత్రి 9:00 గంటల వరకు నిరంతరం మీ కోసమే అందుబాటులో ఉన్నారు.దేశం కోసం... వన్ నేషన్ - వన్ ఓట్ కోసం... మన ఓటును కాపాడుకుందాం! సదా మీ సేవలో – భారతీయ జనతా పార్టీ (BJP) భారత్ మాతాకీ జై! జై శ్రీరామ్!

సహాయం కోసం సంప్రదించాల్సిన హెల్ప్‌డెస్క్ నంబర్లు:

90000 89911, 8885559911 (భారతీయ జనతా పార్టీ సేవా సైనికులు, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ డివిజన్)

# ఒక సంకల్పం ఒక సామాజిక విప్లవం... స్టీల్ బ్యాంక్‌తో ప్లాస్టిక్ రహిత హుస్నాబాద్







## పర్యావరణ పరిరక్షణలో హుస్నాబాద్ చూపిన ఆదర్శం

ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటి. ఒకప్పుడు సౌకర్యంగా భావించిన ప్లాస్టిక్ నేడు ప్రకృతికి, మానవ ఆరోగ్యానికి, జీవావరణానికి పెను ముప్పుగా మారింది. ఒకసారి ఉపయోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువులు నదులు, చెరువులు, పొలాలు, వీధులు నింపేయడంతో పాటు భూగర్భ జలాలను, పశువులను, పర్యావరణ వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యను కేవలం చట్టాలతో లేదా నిషేధాలతో పూర్తిగా అరికట్టడం సాధ్యం కాదు. ప్రజల జీవనశైలిలో మార్పు రావాలి. ఆ మార్పుకు ప్రత్యామ్నాయం ఉండాలి. అదే ఆలోచనతో హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రారంభమైన "స్టీల్ బ్యాంక్" కార్యక్రమం నేడు దేశానికే ఆదర్శంగా నిలిచే ప్రజా ఉద్యమంగా ఎదిగింది.స్వర్గీయ శ్రీ పొన్నం సత్తయ్య గారి సేవా భావాన్ని స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు, శ్రీ పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వంత నిధులతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గౌరవనీయులైన తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ గారి చేతుల మీదుగా గత సంవత్సరం జూలై 17 న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏడాది కాలంలోనే హుస్నాబాద్‌లో పర్యావరణ పరిరక్షణకు ఒక కొత్త దిశను చూపించింది.

## నిషేధం కాదు ప్రత్యామ్నాయమే శాశ్వత పరిష్కారం

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలంటే ప్రజలకు ఉపయోగకరమైన ప్రత్యామ్నాయం అందించాల్సిందే. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని స్టీల్ బ్యాంక్ భావన రూపుదిద్దుకుంది. గ్రామాల్లో జరిగే పెళ్లిళ్లు, శుభకార్యాలు, అన్నదానాలు, సామాజిక కార్యక్రమాల కోసం ప్లాస్టిక్ పాత్రలకు బదులుగా స్టీల్ పాత్రలను అందుబాటులోకి తీసుకువచ్చారు.హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో గ్రామ మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తూ మొత్తం 276 గ్రామ సంఘాల్లో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేశారు. ఒక్కో స్టీల్ బ్యాంక్‌లో 13 రకాల స్టీల్ పాత్రలు ఉండేలా 300, 400, 500 పాత్రల సామర్థ్యం కలిగిన సెట్లను గ్రామాల అవసరాలకు అనుగుణంగా అందించారు.

ఈ కార్యక్రమం వల్ల 7,376 స్వయం సహాయక సంఘాలకు చెందిన 80,633 మంది మహిళలు ప్రత్యక్ష లబ్ధిదారులుగా మారారు. మహిళా సంఘాలే ఈ స్టీల్ బ్యాంకులను నిర్వహించడం వల్ల గ్రామాల్లో బాధ్యత, క్రమశిక్షణ, సమిష్టి భాగస్వామ్యం మరింత బలపడింది.ఈ కార్యక్రమం వెనుక ఉన్న గొప్ప విషయం ఏమిటంటే ఇది ప్రభుత్వ నిధులతో కాదు, శ్రీ పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.2.54 కోట్లకు పైగా స్వంత నిధులతో అమలు చేయబడింది. సమాజం ఇచ్చిన ప్రేమకు తిరిగి సమాజానికే సేవ రూపంలో అందించిన అరుదైన కార్యక్రమంగా ఇది నిలిచింది.

## గ్రామాల నుంచి హోటళ్ల వరకు విస్తరించిన పర్యావరణ ఉద్యమం

స్టీల్ బ్యాంక్ ప్రభావం కేవలం గ్రామాలకే పరిమితం కాలేదు. ప్రజలు నిత్యం వెళ్లే హోటళ్లలో కూడా ప్లాస్టిక్ గ్లాసుల వినియోగాన్ని తగ్గించాలనే లక్ష్యంతో 319 హోటళ్లకు 33,900 స్టీల్ గ్లాసులను ఉచితంగా పంపిణీ చేశారు. దీంతో వేల సంఖ్యలో ప్లాస్టిక్ గ్లాసుల వినియోగం తగ్గింది. వ్యాపార సంస్థలు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావచ్చని ఈ కార్యక్రమం నిరూపించింది.

## మహిళా సంఘాలే విజయానికి వెన్నెముక

ఈ కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాల పాత్ర అత్యంత కీలకం. స్టీల్ పాత్రలను భద్రపరచడం, అవసరమైన వారికి అందించడం, తిరిగి స్వీకరించడం, నిర్వహణ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడం ద్వారా మహిళలు ఈ ఉద్యమానికి అసలైన నాయకత్వం వహించారు. ఇది మహిళా సాధికారతకు కూడా ఒక మంచి ఉదాహరణగా నిలిచింది.

## పచ్చదనం - పరిశుభ్రత -ప్రజల భాగస్వామ్యం

స్టీల్ బ్యాంక్‌తో పాటు హుస్నాబాద్‌లో చెరువుల అభివృద్ధి, మొక్కల పెంపకం, రోడ్ల సుందరీకరణ, ప్రజా ప్రదేశాల అభివృద్ధి వంటి కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగాయి. అర్బన్ ఫారెస్ట్ పార్క్, ఏల్లమ్మ చెరువు, పల్లె చెరువు, కొత్త చెరువు పరిసరాల అభివృద్ధి, "i Love Husnabad" ప్రదేశం, త్రిశూలం జంక్షన్, గాంధీ విగ్రహం పరిసరాల సుందరీకరణ, యోగా లోగోలతో కూడిన డివైడర్లు, ఎల్కతుర్తి చౌరస్తా వంటి ప్రాంతాలు పరిశుభ్రత, పచ్చదనానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి.ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గడంతో చెరువులు పరిశుభ్రంగా మారాయి. కాలుష్యం తగ్గింది. వ్యవసాయ భూములు రక్షించబడుతున్నాయి. ఇంటి పరిసరాల్లో పెంచే కూరగాయలు కూడా పరిశుభ్రమైన వాతావరణంలో సాగు అయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.

## అభివృద్ధికి కొత్త నిర్వచనం

అభివృద్ధి అంటే కేవలం సిమెంట్ రోడ్లు, భారీ భవనాలు, వంతెనలు మాత్రమే కాదు. ప్రజల ఆలోచనల్లో మార్పు తీసుకురావడం, ప్రకృతిని కాపాడే అలవాట్లను పెంపొందించడం, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం కూడా నిజమైన అభివృద్ధే. స్టీల్ బ్యాంక్ కార్యక్రమం అలాంటి అభివృద్ధికి ఒక సజీవ ఉదాహరణ.

## హుస్నాబాద్ మోడల్ - తెలంగాణకు ఆదర్శం

ఒక నియోజకవర్గంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచే సామర్థ్యం కలిగి ఉంది. ప్లాస్టిక్ సమస్యకు స్థానికంగా, ప్రజల భాగస్వామ్యంతో, మహిళా సంఘాల నాయకత్వంలో పరిష్కారం చూపించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత.ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, గ్రామ ప్రజలు కలిసి పనిచేస్తే పర్యావరణ పరిరక్షణ ఎంత సమర్థవంతంగా సాధ్యమవుతుందో హుస్నాబాద్ నిరూపించింది. స్టీల్ బ్యాంక్ ఒక సంవత్సరం పూర్తి చేసుకోవడం ఒక మైలురాయి మాత్రమే. ఈ ప్రయాణం ఇక్కడితో ముగిసేది కాదు. ప్లాస్టిక్ రహిత గ్రామాల నుంచి ప్లాస్టిక్ రహిత పట్టణాల వరకు, అక్కడి నుంచి ప్లాస్టిక్ రహిత తెలంగాణ దిశగా ఈ ఉద్యమం విస్తరించాల్సిన అవసరం ఉంది.ప్రకృతిని కాపాడటం అనేది ఒక్కరి బాధ్యత కాదు. అది సమాజం మొత్తానికి చెందిన బాధ్యత. హుస్నాబాద్‌లో నాటిన ఈ చైతన్య విత్తనం రాష్ట్రం అంతటా విస్తరిస్తే, పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది.స్టీల్ బ్యాంక్ కేవలం స్టీల్ పాత్రల పంపిణీ కార్యక్రమం కాదు... అది ఒక ఆలోచన. ఒక సామాజిక బాధ్యత. ఒక పర్యావరణ ఉద్యమం. ఒక తరం నుంచి మరో తరానికి పరిశుభ్రమైన భూమిని అందించాలనే సేవా సంకల్పం.ఒక సంవత్సరం క్రితం నాటిన చిన్న విత్తనం నేడు హుస్నాబాద్ అంతటా పర్యావరణ చైతన్య వృక్షంగా విస్తరించింది. ఈ వృక్షం నీడలో పెరుగుతున్నది కేవలం పచ్చదనం మాత్రమే కాదు బాధ్యతగల సమాజం కూడా...



నాగరాజు పిఆర్ఓ
టు ట్రాన్స్‌పోర్ట్ అండ్ బీసీ వెల్ఫేర్ మినిస్టర్

# తెలంగాణ స్కిల్ మోడల్‌కు ఇరాన్ ప్రశంసలు

- స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఇరాన్ ఆసక్తి
- ఇరాన్ కార్మిక, సహకార, సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అహ్మద్ మైదారితో మంత్రి వివేక్ భేటీ

**హైదరాబాద్, వెలుతురు జూలై 16:**



అత్యాధునిక నైపుణ్య శిక్షణ, ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దుతున్న తెలంగాణ యువత భవిష్యత్తులో ఇరాన్ అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా నిలుస్తారని శక్తి ( కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీస్) మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. భారత్–ఇరాన్ మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక, వాణిజ్య, చారిత్రక సంబంధాలు భవిష్యత్తులో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఇరాన్ కార్మిక, సహకార, సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అహ్మద్ మైదారి నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో మంత్రి వివేక్ వెంకటస్వామి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమలకు అనుసంధానమైన శిక్షణా విధానం, విదేశీ ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ATCs), తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (TOMCOM) ద్వారా తెలంగాణ దేశంలోనే ఆదర్శవంతమైన స్కిల్ డెవలప్‌మెంట్ ఎకోసిస్టమ్‌ను నిర్మించిందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతకు ఆధునిక నైపుణ్యాలు అందిస్తూ ప్రపంచ స్థాయి ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.తెలంగాణలో శిక్షణ పొందిన యువత ఇప్పటికే జర్మనీ, జపాన్‌తో పాటు గల్ఫ్ దేశాల్లో విజయవంతంగా ఉద్యోగాలు చేస్తున్నారని, అదే తరహాలో భవిష్యత్తులో ఇరాన్‌కు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరును కూడా తెలంగాణ అందించగలదనే విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో తెలంగాణ–ఇరాన్ మధ్య పరస్పర సహకారం మరింత విస్తరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.సమావేశంలో కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాసరి హరిచందన తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవస్థపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అమలు చేస్తున్న శిక్షణా విధానం, పరిశ్రమల భాగస్వామ్యం, అంతర్జాతీయ ఉద్యోగాల కోసం చేపడుతున్న చర్యలు, టామ్‌కామ్ కార్యకలాపాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా గిగ్ వర్కర్ల సామాజిక భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన చారిత్రాత్మక చట్టంపై ప్రతినిధి బృందానికి వివరించారు.ఇరాన్ ప్రతినిధి బృందం తెలంగాణలో అమలు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ మోడల్, కార్మిక పరిపాలన, విదేశీ ఉపాధి కార్యక్రమాలు, సంక్షేమ విధానాలపై ఆసక్తి కనబరిచింది. భవిష్యత్తులో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, శిక్షణ, సంస్థాగత భాగస్వామ్యాలపై రెండు ప్రాంతాల మధ్య సహకార అవకాశాలను విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు ఇరాన్ సహకార, కార్మిక శాఖ ఉపమంత్రి డాక్టర్ సర్ఫీ, భారతదేశంలోని ఇరాన్ రాయబారి డాక్టర్ ఫత్ అలీ, హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్ అహ్మదియే, వైస్ కాన్సుల్ మొహ్సెన్ మొఘద్దామి తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా నిర్ధారణ నైపుణ్యాల పెంపునకు ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ

**హైదరాబాద్ వెలుతురు జూలై 16:**

అడిషనల్ డైరెక్టర్ (మలేరియా & ఫైలేరియా) డా. కె. పద్మజ గారి ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు మూడు రోజుల మైక్రోస్కోపిక్ ఎగ్జామినేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణలో డీడీ వి. వెంకటేశ్వర్లు, ఎన్‌వీబీడీసీపీ కన్సల్టెంట్ సైదులు మలేరియా రక్త పూతల స్లైడ్ల పరీక్షలు, సూక్ష్మదర్శిని ద్వారా పరాన్నజీవుల గుర్తింపు, ల్యాబ్ రిజిస్టర్లు మరియు రికార్డులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించే విధానం, నివేదికల నమోదు తదితర అంశాలపై శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ డిస్ట్రిక్ట్ మలేరియా ఆఫీసర్ కూడా పాల్గొన్నారు. ఈ శిక్షణ ద్వారా ల్యాబ్ టెక్నీషియన్ల నైపుణ్యాలు మెరుగుపడి, మలేరియా నిర్ధారణ మరియు వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు.






# ఐఎస్ఎస్‌కు చేరుకున్న భారత సంతతి వ్యోమగామి అనిల్ మేనన్

- సోయుజ్ ఎంఎస్-29లో ఇద్దరు రష్యన్ వ్యోమగాములతో కలిసి అంతరిక్ష యాత్ర
- ఎనిమిది నెలల పాటు ఐఎస్ఎస్‌లో శాస్త్రీయ ప్రయోగాలు.. 2027 ఏప్రిల్‌లో భూమికి తిరుగు

**వాషింగ్టన్,వెలుతురు జూలై 16:**

భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి అనిల్ మేనన్ విజయవంతంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) చేరుకున్నారు. రష్యా అంతరిక్ష సంస్థ రోస్కోస్మోస్‌కు చెందిన సోయుజ్ ఎంఎస్–29 వ్యోమనౌకలో రష్యన్ వ్యోమగాములు డుబ్రోవ్, అన్నా కికినాతో కలిసి ఆయన ఈ యాత్ర చేపట్టారు. కజకిస్థాన్‌లోని బైకనూర్ కాస్మోడ్రోమ్ నుంచి భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 8:17 గంటలకు వ్యోమనౌక విజయవంతంగా ప్రయాణం ప్రారంభించింది. సుమారు మూడు గంటల అనంతరం ఐఎస్ఎస్‌లోని ప్రిచాల్ మాడ్యూల్‌కు సురక్షితంగా అనుసంధానమైంది. అవసరమైన భద్రతా తనిఖీలు పూర్తయ్యాక హ్యాచ్‌ను తెరిచి బుధవారం తెల్లవారుజామున అనిల్ మేనన్‌తో పాటు ఇద్దరు రష్యన్ వ్యోమగాములు అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించారు. అక్కడ ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న వ్యోమగాములు వారికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ బృందం సుమారు ఎనిమిది నెలల పాటు ఐఎస్ఎస్‌లో నివసిస్తూ జీవశాస్త్రం, వైద్యశాస్త్రం, కృత్రిమ మేధ (ఏఐ), అంతరిక్ష సాంకేతికతకు సంబంధించిన కీలక శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించనుంది. మిషన్ పూర్తయిన అనంతరం 2027 ఏప్రిల్‌లో భూమికి తిరిగి రానుంది.





# కులవృత్తులను ఎక్కువగా ప్రోత్సహించాలి





- ప్రభుత్వం కుల వృత్తులకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తుంది.
- రాష్ట్ర రవాణా , బి.సి. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- బి.సి. కుల వృత్తులను ఎక్కువగా ప్రోత్సహించాలని రాష్ట్ర రవాణా, బి.సి. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**హైదరాబాద్ వెలుతురు జూలై 16:**

గురువారం ఆషాఢ బోనాల సందర్భంగా హెచ్ఎండీఏ మైదానంలో "బోనాలు – చేతివృత్తుల మేళాను–2026 ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, శాసన సభ్యులు మక్కన్ సింగ్ ఠాగూర్, ఈర్ల పల్లి శంకర్, కార్పొరేషన్ల చైర్మన్లు, సెక్రెటరీ బాల మాయ దేవి తో కలసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆలోచనలకు అనుగుణంగా కులవృత్తులను ప్రోత్సహించడం, బీసీ వర్గాలకు చెందిన కళాకారులకు తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జూలై 16 నుంచి 26 వరకు పది రోజులపాటు నిర్వహిస్తున్న ఈ మేళాలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీసీ చేతివృత్తుల కళాకారులకు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.



బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కులవృత్తులు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమే కాకుండా పర్యావరణహితమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కూడా ప్రోత్సహిస్తాయని అన్నారు. సంప్రదాయ ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు భావితరాలకు కులవృత్తుల ప్రాధాన్యతను తెలియజేస్తూ కుల వృత్తుల కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రజలందరూ ఈ ప్రదర్శనలను సందర్శించి బీసీ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.





ఇలా చేయడం ద్వారా సంప్రదాయ కులవృత్తులను ఆదరించడమే కాకుండా వేలాది మంది కళాకారుల జీవనోపాధికి తోడ్పాటు అందించిన వారవుతారని అన్నారు.ప్రదర్శన ప్రారంభానంతరం మంత్రి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వృత్తి కళాకారులతో ముచ్చటించారు.ఈ ప్రదర్శనలో టెర్రకోట ఉత్పత్తులు, మట్టి పాత్రలు, జనపనార ఉత్పత్తులు, గద్వాల్ చీరలు, పోచంపల్లి ఇకత్ చేనేత వస్త్రాలు, నిర్మల్ బొమ్మలు, నిర్మల్ చిత్రకళా ఉత్పత్తులు, వెండి ఫిలిగ్రీ కళాఖండాలు, వరాహి హస్తకళ ఉత్పత్తులు, వరంగల్ దుర్రీలు, నారాయణపేట చేనేత వస్త్రాలు, పెంబర్తి ఇత్తడి కళాఖండాలు, సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలోని సేంద్రీయ ఆహార ఉత్పత్తులు, రానున్న వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలు, పూసల కళాఖండాలు, సంప్రదాయ మందులు, విశ్వకర్మ కళాకారుల ఉత్పత్తులు, ప్రభుత్వ విజయ డెయిరీ ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి.ఈ ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుల నైపుణ్యాన్ని మంత్రి అభినందిస్తూ, తమ సంప్రదాయ కళలు, కులవృత్తులను భావితరాలకు అందించే దిశగా వారు నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సి. ఈ ఓ ఎబిసి కార్పొరేషన్ అలోక్ కుమార్, సెక్రెటరీ బి.సి రెసిడెన్సీ యల్ సైదులు, ఎం.డి బి.సి. కార్పొరేషన్ మల్లయ్య బట్టు, బి.సి. స్టడీ సర్కిల్ హరికృష్ణ, వివిధ బీసీ కుల కార్పొరేషన్ల చైర్మన్లు, పలు సంఘాలు, అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు వెలుగులు

- ఆరు నెలల్లోనే 9,800 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం
- 90 శాతం అంగన్‌వాడీలకు విద్యుత్.. త్వరలోనే నూరు శాతం
- గత పాలకులు బంగారు తెలంగాణ అని ఊదరగొట్టారు.. భవిష్యత్ తరాలకు కనీసం విద్యుత్ ఇవ్వలేదు- మంత్రి సీతక్క

**హైదరాబాద్ వెలుతురు జూలై 16:**

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చీకట్లు తొలగిపోతున్నాయి. చిన్నారుల భవిష్యత్‌కు పునాది వేసే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో యుద్ధ ప్రాతిపదికన అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు కల్పిస్తున్నారు. కేవలం గత ఆరు నెలల్లోనే 9,800 అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తగా విద్యుత్ సౌకర్యం కల్పించడం విశేషం.రాష్ట్రంలో మొత్తం 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 32,109 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అంటే దాదాపు 90 శాతం అంగన్‌వాడీ కేంద్రాలు విద్యుత్ వెలుగులతో కళకళలాడుతున్నాయి. మిగిలిన కేంద్రాలకు సైతం త్వరితగతిన విద్యుత్ సౌకర్యం కల్పించి నూరు శాతం విద్యుదీకరణ లక్ష్యాన్ని చేరుకునేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలు వేగవంతం చేసింది.గతంలో దాదాపు 40 శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యమే లేకపోవడంతో చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చీకటి గదులు, ఉక్కపోత వాతావరణంలో చిన్నారులు కేంద్రాలకు రావాలంటేనే భయపడే పరిస్థితులు ఉండేవి. ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంతో వేసవి కాలంలో పిల్లలను కేంద్రాల్లో ఉంచడం అంగన్‌వాడీ కార్యకర్తలకు సవాల్‌గా మారేది. డిజిటల్ బోధనకు సైతం విద్యుత్ లేమి ప్రధాన అడ్డంకిగా నిలిచింది.ఈ పరిస్థితిని గుర్తించిన మంత్రి సీతక్క అంగన్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న విధానాన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం వర్తింపజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన అంశం కావడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైంది.విద్యుత్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ కొత్త కనెక్షన్ల ప్రక్రియను వేగవంతం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో పెండింగ్ కనెక్షన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఫలితంగా 11 వేల 194 కేంద్రాలకు నూతనంగా విద్యుత్ సదుపాయం కల్పించారు. అయితే గత ఆరు నెలల వ్యవధిలోనే 9,800 కేంద్రాలు విద్యుత్ వెలుగులను సంతరించుకున్నాయి.అంగన్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణ పురోగతిపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. “బలమైన భవిష్యత్‌కు బాల్యమే పునాది. చిన్నారులు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణంలో ఎదగాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాల కల్పన మా ప్రభుత్వ బాధ్యత. త్వరలోనే మిగిలిన కేంద్రాలకు కూడా విద్యుత్ సౌకర్యం కల్పించి నూరు శాతం లక్ష్యాన్ని సాధిస్తాం” అని మంత్రి స్పష్టం చేశారు.గత ప్రభుత్వం బంగారు తెలంగాణ అంటూ గొప్పలు చెప్పుకుందని, కానీ భవిష్యత్ తరాలకు పునాది వేసే వేలాది అంగన్‌వాడీ కేంద్రాలకు కనీస విద్యుత్ సౌకర్యం కూడా కల్పించలేకపోయిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. “ప్రచారంలో వెలుగులు చూపించారు తప్ప.. అంగన్‌వాడీల్లో చీకట్లు తొలగించలేదు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మాటలతో కాదు.. చేతలతో చిన్నారుల కేంద్రాల్లో వెలుగులు నింపుతోంది” అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.




# అమెరికా సైనికులను బంధించండి ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి సంచలన పిలుపు

- అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందాన్ని 'మోసపూరిత ప్రణాళిక'గా అభివర్ణించిన మాజీ విదేశాంగ మంత్రి
- ఖర్గ్ ద్వీపం, హర్మూజ్ పరిసర ప్రాంతాలపై అమెరికా ఒత్తిడి నేపథ్యంలో తీవ్ర వ్యాఖ్యలు
- అమెరికా—ఇరాన్ ఉద్రిక్తతల మధ్య మరోసారి యుద్ధ వాతావరణం



**టెహ్రాన్, జూలై 16**

అమెరికా—ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఇరు దేశాలు ఇటీవల కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ పరస్పర దాడులు, హెచ్చరికలు కొనసాగుతుండటంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఈ నేపథ్యంలో ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి, ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న మనుచెహర్ మొత్తకి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలపై భూతల దాడులు చేసి, 100 మంది అమెరికా సైనికులను బంధించి ఇరాన్‌కు తీసుకురావాలని ఆయన బహిరంగంగా పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలను ఇరాన్‌కు చెందిన పలు మీడియా సంస్థలు ప్రసారం చేశాయి. మనుచెహర్ మొత్తకి మాట్లాడుతూ.. అమెరికా ప్రాంతీయ సైనిక స్థావరాలపై నేరుగా దాడులు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఒక అమెరికా స్థావరాన్ని స్వాధీనం చేసుకుని అక్కడి సైనికులను బందీలుగా తీసుకొస్తేనే అమెరికాకు తగిన సమాధానం ఇచ్చినట్టవుతుందని వ్యాఖ్యానించారు. ఈ చర్య ద్వారా అమెరికాపై ఒత్తిడి పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందంపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలు పూర్తిగా అమెరికా రచించిన మోసపూరిత ప్రణాళికేనని ఆరోపించారు. రెండు, మూడు రోజుల్లోనే ఇస్లామిక్ రిపబ్లిక్‌కు ముగింపు పలకాలని అమెరికా భావించిందని, అయితే ఆ ప్రయత్నం పూర్తిగా విఫలమైందని అన్నారు.

అలాగే ఇరాన్‌పై దాడులకు బాధ్యులంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అంతర్జాతీయ స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమెరికా హర్మూజ్ జలసంధి పరిసరాల్లోని ఇరాన్ సైనిక స్థావరాలు, డ్రోన్ మరియు క్షిపణి నిల్వ కేంద్రాలపై దాడులు కొనసాగిస్తున్నట్లు సమాచారం. అలాగే ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఖర్గ్ ద్వీపంపై కూడా అమెరికా ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో ఇరాన్ నేతల వ్యాఖ్యలు మరింత దూకుడుగా మారుతున్నాయి. ఈ పరిణామాల మధ్య మనుచెహర్ మొత్తకి చేసిన వ్యాఖ్యలు ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశముందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com